
తేలియాడుతూ తినేద్దాం..

27న గోదావరిపై ఫ్లోటింగ్ రెస్టారెంట్ ప్రారంభం



రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆహ్లాదకర వాతావరణంలో గోదారి అందాల నడుమ రుచుల విందు ఆస్వాదించేలా ఫ్లోటింగ్ రెస్టారెంట్ సిద్ధమవుతోంది. పర్యాటకశాఖ సౌజన్యంతో ప్రైవేటు వ్యక్తుల నిర్వహణలో గోదావరిపై తొలిసారిగా పూర్తిస్థాయిలో ఇది అందుబాటులోకి రానుంది. రాజమహేంద్రవరంలోని ఉమా మార్కండేయస్వామి ఆలయం సమీపంలోని లాంచీల రేవు నుంచి ఏపీ టూరిజం బోట్‌ల ద్వారా ప్రయాణించి ఫ్లోటింగ్ రెస్టారెంట్‌కు చేరుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 27న ఆదివారం ఉదయం 10.30 గంటలకు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ దీనిని ప్రారంభిస్తారని, ఎంపీ పురందేశ్వరి తదితరులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కిట్టీ పార్టీలు, పుట్టినరోజు వేడుకలు నిర్వహించుకునేందుకు సైతం అనువుగా ఈ రెస్టారెంట్ ఉంటుందన్నారు.

సామర్లకోటలో హెల్ప్ డెస్క్

సామర్లకోట గ్రామీణం, న్యూస్‌టుడే: దానా తుపాను నేపథ్యంలో సామర్లకోట రైల్వేస్టేషన్‌లో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం ద్వారా రైళ్ల రద్దు, ఆలస్యంగా నడిచే రైళ్ల వివరాలు వంటి సమాచారం అందిస్తున్నట్లు రైల్వే అధికారి రమేష్ గురువారం తెలిపారు. సామర్లకోట హెల్ప్‌డెస్క్ నంబరు 0884-2327010కు ఫోన్ చేసి ప్రయాణికులు వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

నారసింహం.. నయన మనోహరం



అలరించిన మోహినియాట్టం నృత్యం



వట్టివేళ్ల కిరీటాలతో ఉత్సవ మూర్తుల దర్శనం

వాడపల్లి(ఆత్రేయపురం): వాడపల్లి శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సింహవాహనంపై స్వామి వైభవంగా ఊరేగారు. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి యోగనరసింహ అలంకరణలో తిరువీధుల్లో విహరించడంతో భక్తులు జయజయ ధ్వానాలు చేశారు. సింహం పరాక్రమానికి, ధైర్యానికి, తేజస్సుకు, ఆధిపత్యానికి, మహా ధ్వనికి సంకేతం. అజ్ఞానంతో ప్రవర్తించే దుష్టులను హరించడంలో తాను సింహ సమానంతో ప్రయత్నిస్తానన్న శ్రీవారి సందేశాన్ని ఈ సందర్భంగా పండితులు వినిపించారు. మహా స్నపన, ప్రధాన హోమాలు, తిరుప్పావడ సేవ, మహాశాంతి హోమం తదితర కార్యక్రమాలను పండితుడు రాజేశ్వర వరప్రసాదాచార్యులు నేతృత్వంలో అర్చకస్వాములు జరిపించారు. స్వామివారికి డీసీ ఎన్ఎస్ చక్రధరరావు, కనక దుర్గాదేవి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు.

శుక్రవారం మహాలక్ష్మీహోమం, మలయప్ప అలంకరణలో గరుడ వాహన సేవ ఉంటాయి.



సింహవాహన సేవ

ఇక కొత్త ధర్మకర్తలు

అన్నవరంలో 18కి చేరనున్న సభ్యుల సంఖ్య

అన్నవరం, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలోని అన్నవరం, ఇతర ప్రధానాలయాలకు ధర్మకర్తల మండలి (పాలకమండలి) నియామకానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. మరో ఇద్దరు సభ్యులను పెంచనున్నారు. ఇందులో బ్రాహ్మణ, నాయీ బ్రాహ్మణులను ఒక్కొక్కరిని నియమిస్తారు. అన్నవరం ఆలయానికి ప్రస్తుతం 16 మంది (వ్యవస్థాపక ధర్మకర్తతో కలిసి) ఉండగా ఈ సంఖ్య 18కి పెరగనుంది. గతంలో మాదిరిగా రిజర్వేషన్లు అమలుచేస్తారు. త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తులు ఆహ్వానిస్తారు. పోలీసు, దేవాదాయశాఖ ద్వారా సత్ప్రవర్తన, ఇతర వివరాలు సేకరించి సభ్యులను నియమించే అవకాశముంది.



దాతలకు అవకాశం..

దేవస్థానం అభివృద్ధికి కృషి చేసిన దాతలకు పాలకమండలిలో చోటు దక్కే అవకాశముంది. అన్నవరం ఆలయానికి రూ.కోట్ల విలువైన ప్రసాదం తయారీ భవనం.. స్వామి, అమ్మవార్లకు వజ్రకిరీటం.. ఆలయ గోడలు, ధ్వజస్తంభానికి బంగారు తాపడం, ఉచిత కల్యాణ మండపాలు, వ్యక్తిగత కాటేజీలు, సహస్ర దీపాలంకరణ మందిరం తదితర పనులను దాతలు చేపట్టారు. 2017 జూన్‌లో ఇద్దరు దాతలకు సైతం సభ్యులుగా చోటిచ్చారు. దీంతో వారు తమ సొంత నిధులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

వైకాపా హయాంలో ఇదీ పరిస్థితి

గత వైకాపా పాలనలో 2020, 2023లో నియమితులైన పాలకమండళ్ల సభ్యులు దేవస్థానం శ్రేయస్సు, భక్తులకు సౌకర్యాలు కల్పించడంపై దృష్టి సారించలేదు. అప్పటి ప్రభుత్వం వీరి గురించి ఎటువంటి పరిశీలన లేకుండానే నేరుగా నియమిస్తూ ఆర్డినెన్స్ తీసుకువచ్చింది. ప్రత్యేక ఆహ్వానితుల పేరిట స్థానిక ఎమ్మెల్యే, ఆ శాఖ మంత్రి అనుయాయులను నియమించి రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చేసింది. అన్నవరంలో అంతర్గత రహదారుల పేరిట కొండలను విధ్వంసం చేసి రూ.కోట్లలో దేవస్థానం నిధులు దుర్వినియోగం చేసినా నోరుమెదపలేదు.

విమానాశ్రయం ఇక్కడా? అక్కడా?



ఈనాడు, కాకినాడ -న్యూస్‌టుడే, తొండంగి, తుని పట్టణం

- తొండంగి మండలంలో 519 ఎకరాల భూమి లభ్యతపై ప్రతిపాదన
- కాకినాడ-అమలాపురం మధ్యలో ఏర్పాటు మేలన్న వాదన..
- రెండు జిల్లాలను ఊరిస్తున్న ప్రాజెక్టు

కాకినాడ, కోనసీమ జిల్లాల్లో ఎక్కడా విమానాశ్రయం లేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యాంశం కింద తీసుకుంది. అయితే ఎక్కడ ఏర్పాటనే అంశంపై తర్జనభర్జన సాగుతోంది. ఇప్పటికే తుని-అన్నవరం మధ్యలో భూముల లభ్యతపై ప్రతిపాదనలు వెళ్లడంతో ఇక్కడే ఖరారవ్వచ్చనే చర్చ ఉంది. దీనిని యంత్రాంగం ఇంకా ధ్రువీకరించ లేదు. ప్రజల రాకపోకల సౌలభ్యం, భూములు.. పారిశ్రామిక- వ్యాపార- వాణిజ్య- పర్యాటక ప్రాంతాలు బేరీజు వేసుకుని నిర్ణయం తీసుకోనున్నారు.

సౌలభ్యం పరిశీలిస్తే..

- కాకినాడ- అమలాపురం మధ్యలో విమానాశ్రయం వస్తే రాజమహేంద్రవరం వెళ్లాల్సిన అవసరం ఉండదు.
- అమలాపురం నుంచి తుని లోని విమానాశ్రయానికి వెళ్లాలంటే 123 కి.మీ.. కాకినాడ నుంచైతే 60 కి.మీ ఉంది.
- తాళ్లరేవు, కరప అనువైన ప్రాంతాలని, రెండు జిల్లాలవారికీ దూరాభారం ఉండదనే వాదన ఉంది.

ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సూచనలతో 3సీ, 4సీ, 4ఈ టైప్ ఎయిర్ క్రాఫ్టులు నిలిపేందుకు వీలుగా.. ఎయిర్ సైడ్, సిటీ సైడ్, రన్‌వే స్ట్రిప్‌ను భవిష్యత్తులో విస్తరించేందుకు ఎంత భూమి అవసరమో నిర్దేశించారు. తుని నియోజకవర్గం తొండంగి మండలం బెండపూడి, చిన్నయ్యపాలెం పరిధిలో విమానాశ్రయానికి 519 ఎకరాలు అందుబాటులో ఉన్నట్లు గుర్తించారు. 1,222 మంది రైతుల నుంచి సేకరించాలి. అన్నవరం దేవస్థానం, సెజ్ పరిధిలోని భూమి కావడంతో ఎకరం రూ.70 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంది. భూసేకరణకే రూ.500 కోట్లు అవసరం.

కసరత్తు షురూ..

ప్రణాళికలతో సరి..

ఉమ్మడి జిల్లాలో నగరాలు, పట్టణాలను రానున్న 30 ఏళ్లలో ఎలా అభివృద్ధి చేయాలన్న ప్రణాళికతో గతంలో గోదావరి నగరాభివృద్ధి సంస్థ 'దృక్పథ ప్రణాళిక' గుడా విజన్-2050లో భాగంగా ప్రతిపాదనలు రూపొందించింది. కాకినాడలో విమానాశ్రయం, మెట్రో రైలు ప్రాజెక్టు ఏర్పాటు ఆవశ్యకతను ప్రస్తావించింది. వైకాపా ప్రభుత్వం వచ్చాక ఒక జిల్లా-ఒక విమానాశ్రయం నినాదంతో హడావుడే తప్ప ప్రయత్నాలు సాగలేదు.

రెండింటీ ప్రాధాన్యాన్ని గుర్తించి..

కూటమి ప్రభుత్వం వచ్చాక.. తొలి ప్రాధాన్యంగా కాకినాడ- అమలాపురం మధ్య విమానాశ్రయం నిర్మించాలన్న ప్రతిపాదన వచ్చింది. కాకినాడలో ఇప్పటికే రెండు పోర్టులు ఉన్నాయి. పారిశ్రామికంగా కాకినాడ.. కొబ్బరి, ఇతర ఆహార ఉత్పత్తుల కేంద్రంగా కోనసీమ ఉండటంతో ఈ జిల్లాలకు మధ్యలో విమానాశ్రయం మేలన్న వాదన ఉంది. ఉప్పు భూములు, పోర్టు భూములు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు తొలగిస్తే ప్రాజెక్టు సాకారమయ్యే అవకాశం ఉంది.

బెండపూడి-చిన్నయ్యపాలెంలో విమానాశ్రయం వస్తే దూరం (కి.మీ.లలో)	
తుని పట్టణానికి..	20
రాజమహేంద్రవరం..	80
కాకినాడ..	60
కాకినాడ సెజ్‌కు..	20
విశాఖకు	112



తొండంగి: బెండపూడి-చిన్నయ్యపాలెం మధ్య గుర్తించిన భూములు

డీపీటీ టీకాలు లేవండి!

రాజమహేంద్రవరం వైద్యం: చిన్నారులకు ఏడాదిన్నర వయసులో ఒకసారి, అయిదేళ్లకు మరోసారి వేయాల్సిన డిఫ్తీరియా పెర్టుసిస్ టెటానస్(డీపీటీ) టీకాకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొరత ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వం నుంచి సరఫరా లేకపోవడమే కారణమని అధికారులు చెబుతున్నారు. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పీపీ యూనిట్లలో జరిగే టీకా కార్యక్రమంపై తీవ్ర ప్రభావం పడుతోంది. చిన్నారి వయసు 16-24 నెలల మధ్య డీపీటీ మొదటి బూస్టర్, 5-6 ఏళ్ల మధ్య రెండో బూస్టర్ టీకా వేస్తారు. తూర్పు, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో నెలకు 30 వేల డీపీటీ డోసులు అవసరమవుతాయి. చాలాచోట్ల రెండు నెలలకు పైగా కొరత ఉంది. దీంతో చిన్నారులతో వచ్చే తల్లులను వెనక్కి పంపేస్తున్నారు. నెల క్రితం వరకు పాతవాటినే సరిపెట్టారు. టీకాల వినియోగంపై 'ఇ-విన్' పోర్టల్‌లో సక్రమంగా నమోదుచేయకపోవడం సమస్యగా మారింది. మరో రెండు, మూడు రోజుల్లో వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.



జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో తిప్పేనాయక్

అనుమతిలేని బాణసంచా కేంద్రాలపై చర్యలు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: అనుమతి లేకుండా బాణసంచా తయారు చేసినా, అక్రమంగా నిల్వచేసినా కఠిన చర్యలు తప్పవని సంయుక్త కలెక్టర్ రాహుల్‌మీనా హెచ్చరించారు. దీపావళి సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులతో గురువారం ఆయన సమీక్షించారు. పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేయాలన్నారు. దీపావళికి మూడ్రోజుల ముందు నుంచి విక్రయాలకు అనుమతి ఇవ్వాలన్నారు. 25 లోగా నిర్వహణకు తాత్కాలిక అనుమతులు పొందాలన్నారు. సురక్షితమైన మైదానాల్లోనే విక్రయాలకు అనుమతి ఇవ్వాలన్నారు. అక్కడ అంబులెన్స్‌లు, అగ్నిమాపక శకటాలు ఉంచాలన్నారు. సమావేశంలో డీఆర్వో డి.తిప్పేనాయక్, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణి, డీఎంహెచ్‌వో నరసింహనాయక్, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.

అప్పుడు వాళ్లు.. ఇప్పుడు వీళ్లు..!

ఎన్నికల సొమ్ములో పర్సంటేజీలకు పట్టు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఎన్నికల ఖర్చుకు తొలి విడతలో రూ.19కోట్లు ఇవ్వగా, ఇప్పుడు రూ.13,09,48,777 అదనపు బడ్జెట్‌ను విడుదల చేశారు. ఇందులో ఏడు నియోజకవర్గాలకు రూ.8,52,95,800 కేటాయిస్తూ కలెక్టర్ షాన్‌మోహన్ ఉత్తర్వులిచ్చారు. మిగతా రూ.4,56,52,977 కలెక్టరేట్‌లో ఉన్నాయి. దీనిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇలా ఉండగా వీటికి ఖర్చు చూపించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఖర్చులపై విజిలెన్స్ విచారణ చేయిస్తే అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉందనే వాదన రెవెన్యూ వర్గాల నుంచి వినిపిస్తోంది.

గుత్తేదారుల బెంబేలు..

అప్పట్లో ఎన్నికల ఖర్చులను తహసీల్దార్లు పర్యవేక్షించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, ఎన్నికల ఉప తహసీల్దార్లు ద్వారా ఖర్చు చేయించారు. అప్పు ప్రాతిపదికన సామగ్రి, ఇతర వనరులను సమకూర్చారు. పోలింగ్‌కు ముందొచ్చిన బడ్జెట్‌ను నియోజకవర్గాలకు కేటాయించగా, కొంతమంది తహసీల్దార్లు కొంతమేర నొక్కేశారు. క్షేత్రస్థాయిలో ఖర్చు చేసిన రెవెన్యూ సిబ్బందికి చుక్కలు చూపించారు. సామగ్రి సమకూర్చిన గుత్తేదారులకు బిల్లులో కోత పెట్టారు. ఇక్కడ పోలింగ్, కౌంటింగ్‌కు జరిగిన ఖర్చులను సంబంధిత తహసీల్దార్లు కలెక్టరేట్‌కు నివేదించి వెళ్లిపోయారు. ఇప్పుడు కొత్త తహసీల్దార్లు వచ్చారు. తాజాగా విడుదల చేసిన బడ్జెట్‌పై వాళ్లల్లో కొంతమంది కన్నేశారు. కమీషన్లకు పట్టుపట్టడంతో క్షేత్రస్థాయిలో ఖర్చుపెట్టిన సిబ్బంది, గుత్తేదారులు బెంబేలెత్తున్నారు.

నియోజకవర్గం	కేటాయింపులు(రూ.)
తుని	1,16,71,956
ప్రత్తిపాడు	1,17,89,349
పిఠాపురం	1,36,94,270
కాకినాడ గ్రామీణం	1,22,07,113
పెద్దాపురం	1,21,16,808
కాకినాడ నగరం	1,21,58,360
జగ్గంపేట	1,16,57,944

కలెక్టరేట్ కేంద్రంగా..!

ఎన్నికల బడ్జెట్‌ను నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు బదలాయించి, అక్కడి నుంచే చేయాలి. ఈసారి దీనికి విరుద్ధంగా కలెక్టరేట్ నుంచి అప్పటి అధికారుల కేంద్రంగా పనులు చేశారు. పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో కలెక్టరేట్ల నుంచి కేవలం 5 శాతం ఎన్నికల నిధులనే ఖర్చు చేశారు. కాకినాడ కలెక్టరేట్‌లో మాత్రం 45 శాతం నిధులను ఇక్కడి అధికారుల ద్వారా ఖర్చు చేయించారు. గతంలో ఇలా జరగలేదని రెవెన్యూ అధికారులే చెబుతున్నారు. సాధారణంగా ఎన్నికల సమయంలో ఈవీఎంలు, వీవీప్యాట్స్ భద్రపరచడానికి అద్దె ప్రాతిపదికన ర్యాక్‌లు తెస్తారు. ఈసారి మాత్రం రూ.30 లక్షలు పెట్టి కొన్నారనే ఆరోపణలు ఉన్నాయి.



కౌంటింగ్‌నాడు జేఎన్‌టీయూకే వద్ద బారికేడ్లు

ఇదేం మెలిక..

పోలింగ్‌కు ముందు బడ్జెట్ రాకపోవడంతో కలెక్టరేట్‌లో వడ్డీ నిధులు వినియోగించారు. జిల్లాలో 1,640 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఒక్కోదానికి రూ.11వేలు చొప్పున రూ.1,80,40,000 కేటాయించారు. ఇప్పుడు వీటిని వెనక్కి చెల్లించాలని కార్యస్థానం తహసీల్దార్లను ఆదేశించారు. తాజాగా కేటాయించిన నిధుల నుంచి వీటిని చెల్లించాలన్నారు. దీంతో జీఎస్టీ 18 శాతం, కొంత శాతం వడ్డీ చెల్లించాలి. ఉదాహరణకు కాకినాడ గ్రామీణ నియోజకవర్గానికి రూ.29లక్షలు ఇచ్చారు. ఇప్పుడు అదనంగా రూ.6లక్షలతో కలిపి రూ.35లక్షలు కలెక్టరేట్‌కు జమ చేయాలి.

పూర్తి స్థాయిలో పరిశీలించి..

అదనపు బడ్జెట్ నుంచి ఆయా నియోజకవర్గాలకు కేటాయించారు. ప్రతిపాదనల ప్రకారం కేటాయింపు జరిగింది. బిల్లులు పూర్తిస్థాయిలో పరిశీలించి, చెల్లించాలని ఆదేశించాం. తహసీల్దార్లతో సమీక్షించాం.

- డి.తిప్పేనాయక్, డీఆర్వో, కాకినాడ

జిల్లా రెవెన్యూ అధికారిగా వెంకటరావు



కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)గా జె.వెంకటరావు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సాధారణ ఎన్నికల్లో ఆయన కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్‌గా పనిచేశారు. కాకినాడ నగర నియోజకవర్గం రిటర్నింగ్ అధికారిగా ఆయన పనిచేశారు. అనంతరం ఇక్కడ నుంచి బదిలీ చేసి, ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఉత్తరుల్విచ్చారు. పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్న ఆయనను కాకినాడ డీఆర్వోగా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న డి.తిప్పేనాయక్‌ను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన విభాగానికి రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో డీఆర్వోగా వచ్చిన ఈయన ఏడు నెలలపాటు ఇక్కడ సేవలందించారు.

వివాదాస్పద స్థలం.. అక్కడే ఎందుకు నిర్మాణం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడ నగరపాలక సంస్థలో టీడీఆర్ బాండ్ల కుంభకోణానికి సంబంధించిన స్థలంలో బయో మెథనేషన్ ప్లాంటు ఏర్పాటు వివాదాస్పదమవుతోంది. గత పాలనలో వైకాపాకు చెందిన కాకినాడ నగర ప్రజాప్రతినిధి తక్కువ ధర భూమికి వందల రెట్లు విలువైన టీడీఆర్ బాండ్లు జారీ చేయించారనే ఆరోపణలు ఉన్నాయి. అప్పనంగా వందల కోట్ల విలువైన టీడీఆర్ బాండ్లు ఇప్పించేశారు. దీనిపై అప్పట్లో ప్రస్తుత కాకినాడ నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పెద్ద పోరాటమే చేశారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న కమిషనర్, ఎమ్మెల్సీ

కుండా ఆరోపణలు ఉన్న స్థలంలో గురువారం ప్లాంటుకు భూమిపూజ చేశారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే పంతం నానాజీ ఈ కార్యక్రమానికి హాజరైనా, విషయం తెలుసుకుని, అక్కడి నుంచి వెనుదిరిగారు. టీడీఆర్ బాండ్ల జారీపై విచారణ జరుగుతున్న స్థలంలో ప్లాంటు ఏర్పాటును నిరసిస్తూ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలను కాదని మున్సిపల్ కమిషనర్ ఏకపక్షంగా శంకుస్థాపన చేయడం తీవ్ర చర్చనీయాంశమైంది.

చర్చనీయాంశంగా నిర్ణయం..

ఇలాంటి స్థలంలో బయోమెథనేషన్ ప్లాంటు ఏర్పాటుకు మున్సిపల్ కమిషనర్ భావన చొరవ తీసుకోవడం వివాదస్పదమవుతోంది. కూటమి ప్రజాప్రతినిధులతో చర్చించ

మంత్రి నారాయణకు ఫిర్యాదు..

టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై విచారణ జరుగుతున్న స్థలంలో ప్లాంటు ఏర్పాటు తగదు. దీనిపై మున్సిపల్ కమిషనర్, అధికారులు చర్చించలేదు. ఫోను చేసి, శంకుస్థాపనకు ఆహ్వానించారు. ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారో చెప్పలేదు. దీని వెనుక వైకాపా నేతలున్నారనే అనుమానాలు ఉన్నాయి. పురపాలక మంత్రి నారాయణకు ఫిర్యాదు చేశాను. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న వ్యవహారాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తాం.

- వనమాడి కొండబాబు, ఎమ్మెల్యే

విచారణలో తేలితే బాండ్లు రద్దు చేస్తాం..

ఈ స్థలం నగరపాలక సంస్థకు చెందినది. గతంలో టీడీఆర్ బాండ్లు జారీ చేసి కొన్నారు. ప్రస్తుతం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ జరుగుతోంది. అవకతవలు నిజమైతే పాత టీడీఆర్ బాండ్లు రద్దు చేస్తాం. విచారణకు అనుగుణంగా కొత్త బాండ్లను జారీ చేస్తాం. స్థలం కార్పొరేషన్ వద్దే ఉంటుంది. కలెక్టర్‌కు నివేదించాం. ప్లాంటుతో నగరానికి ఎంతో ప్రయోజనం.

- భావన, కమిషనర్, నగరపాలక సంస్థ

పంటల బీమాకు రైతులే ప్రీమియం చెల్లించాలి

కాకినాడ కలెక్టరేట్: పంటల బీమా పథకానికి రైతులే స్వచ్ఛందంగా ప్రీమియం చెల్లించాలని కలెక్టర్ షాన్ మోహన్ తెలిపారు. గురువారం అమరావతి నుంచి వ్యవసాయ ప్రత్యేక కమిషనర్ బి.రాజశేఖర్ దూరదృశ్య సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జేసీ రాహుల్‌మీనా, అధికారులు హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. పథకంపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. సచివాలయాలు, సీఎస్‌సీల్లో రైతులు బీమా ప్రీమియం చెల్లించి, పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. డిసెంబరు 31 నాటికి నమోదు ముగుస్తుందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయ్‌కుమార్, ఉద్యానశాఖ సహాయ సంచాలకుడు నేతల మల్లికార్జునరావు, సీపీవో పి.త్రినాథ, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ నుంచి పాల్గొన్న అధికారులు

రీసర్వేలో సమస్యలు పరిష్కరిస్తాం

కిర్లంపూడి: గ్రామాల్లో రీసర్వేతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామని పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి తెలిపారు. కిర్లంపూడి మండలం ముక్కొల్లు గ్రామంలో రీసర్వే గ్రామసభను సర్పంచి జ్యోతుల రాంబాబు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. పది మంది రైతులు గ్రామసభలో అధికారులకు అర్జీలు ఇచ్చారు. వారితో ఆర్డీవో శ్రీరమణి మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇవన్నీ సరిచేశాకనే కొత్త పాస్ పుస్తకాలను ప్రభుత్వం మంజూరు చేస్తుందని ఆర్డీవో తెలిపారు. తహసీల్దారు జె.చిరంజీవి, గ్రామనాయకుడు తోట వెంకటరమణమూర్తి, రీసర్వే ఉపతహసీల్దారు శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలకు అపరాధ రుసుం

సాంబమూర్తినగర్(కాకినాడ): ఆహార భద్రతా నియమావళి ఉల్లంఘించిన పలు దుకాణాలపై కేసు నమోదు చేసి, రూ.2.40 లక్షల జరిమానా విధించినట్లు సహాయ ఆహార నియంత్రణ అధికారి బి.శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 22, 23 తేదీల్లో ఆహార భద్రతా విభాగ అధికారులు తనిఖీలు చేశారు. లైసెన్సులు లేనివి, గడువు ముగిసి విక్రయిస్తున్నవి, తాగునీటికి సంబంధించి, నాణ్యత లేని ఆహారం ఇలా వివిధ అంశాలకు సంబంధించి 15 రకాల కేసులు నమోదు చేశారు. జిల్లా జేసీ కోర్టులో హాజరుపర్చగా జేసీ రాహుల్ మీనా జరిమానా విధించారన్నారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కేవీ సుబ్బారావు పాల్గొన్నారు.

కందుకూరి చరితం.. భావితరాలకు పదిలం

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

చరిత్ర ఎన్నిసార్లు మననం చేసుకున్నా తెలుసుకోవలసింది ఇంకా మిగిలే ఉంటుంది. కందుకూరి వీరేశలింగం.. నాటి సాంఘిక దురాచారాలపై ఉక్కుపాదం మోపి మహిళల జీవితాల్లో వెలుగు నింపారు. సంఘ సంస్కరణల్లో భాగంగా పలు రచనలూ చేశారు. రాజమహేంద్రవరానికి చెందిన ఎస్‌కేవీటీ కళాశాల తెలుగు శాఖాధిపతి పి.వి.బి.సంజీవరావు కందుకూరి జీవితంపై పరిశోధన చేశారు. అప్పట్లో ఆయన సేకరించిన అరుదైన పుస్తకాలను ఇటీవల రాజమహేంద్రవరంలోని కందుకూరి జన్మగృహం (వంకాయలవారి వీధి)లో అందజేశారు. భావి పరిశోధకులకు అనువుగా వీటిని జన్మగృహంలోని గ్రంథాలయంలో భద్రపరిచారు.

వీరేశలింగం జన్మ గృహంలో ఆయన రచనలు

కందుకూరి రచించిన, ఆయనకు సంబంధించిన 60కి పైగా పుస్తకాలు



కందుకూరి కేవలం సంఘ సంస్కర్త మాత్రమే కాదు. సమాజ హితం కోసం కలం పట్టిన రచయిత. తొలి నవలా రచయిత కూడా. వాస్తవ పరిస్థితులను ఆధారంగా చేసుకుని ఆయన రాసిన తొలి తెలుగు నవల 'రాజశేఖర చరిత్ర' నేటికీ ప్రత్యేకమే. తొలి తెలుగు విషాదాంత నాటకం ప్రహ్లాద నాటకం. సమాజంలోని నాటి పరిస్థితులను తూర్పారబెడుతూ కందుకూరి రాసిన అనేక రచనలు పుస్తకాల రూపంలో ఉన్నాయి. బాలలకు సంబంధించిన కథా సాహిత్యం, స్త్రీలకు సంబంధించిన పలు పుస్తకాలు రచించారు.




వంకాయలవారి వీధిలో పుట్టిన ఇల్లు

ఇంట్లో ఇప్పటికీ...

వీరేశలింగం 1881 డిసెంబరు 11న తొలి వితంతు పునర్వివాహం జరిపించిన నాటి ఘట్టాన్ని విగ్రహ రూపంలో కందుకూరి గృహంలో ఏర్పాటు చేశారు. సమాజ చైతన్యం కోసం ఆయన నడిపిన వివేకవర్ధిని పత్రిక, రాసిన నాటకాలు ముద్రించేందుకు వినియోగించిన యంత్రం ఇప్పటికీ భద్రమే. కందుకూరి వినియోగించిన దుస్తులు, రాతప్రతులు, ఆయన కూర్చున్న చెక్క కుర్చీ వంటివి ఇక్కడ చూడవచ్చు. కందుకూరి జీవితంలో ముఖ్యమైన అంశాలను పట్టికల రూపంలో నిక్షిప్తం చేశారు. తన భార్య రాజ్యలక్ష్మి కోసం నిర్మించిన భవనం, ఆవరణలో నుయ్యి, పనస చెట్టు వంటి నాటి గుర్తులు నేటికీ పదిలమే.



వినియోగించిన ముద్రణ యంత్రం



పొందుపరిచిన చరిత్ర వివరాలు

పరిశోధన కోసం ఐదేళ్లు తిరిగా..



నేను పుట్టింది ఇన్నీస్‌పేటలో కావడంతో అదే ప్రాంతంలో కందుకూరి స్వయంగా నిర్మించిన వీటీ విద్యాసంస్థలున్నాయి. చిన్నతనం నుంచి అదే ఆవరణలో ఆడుకోవడం, నాన్న ద్వారా కందుకూరి సంస్కరణలు వినడంతో ఆయన చరిత్రపై ఆసక్తి పెరిగింది. పూర్తిస్థాయిలో వీరేశలింగం జీవితం గురించి తెలుసుకోవాలనే తపనతో 1994 నుంచి 1999 వరకు పరిశోధన చేశా. భీమవరం సమీపంలోని కుముదవల్లి గ్రామంలో కందుకూరి స్వయంగా స్థాపించిన గ్రంథాలయంలో ఆయనకు సంబంధించి అనేక వివరాలు తెలిశాయి. ముఖ్యంగా కందుకూరి మద్రాసులోని వేద విలాస్ భవనంలో ఎక్కువగా ఉండేవారు. పరిశోధన సమయంలో నేను సేకరించిన వివరాలతో పాటు ఆయన పుస్తకాలు, కొన్ని ఆయన రచించిన పుస్తకాలు కలిపి మొత్తం 60 ఇటీవల పురావస్తుశాఖకు అందజేశా. భావితరాలకు ఆయన చరిత్ర పదిలంగా ఉండాలనేది నా కోరిక.

- పి.వి.బి.సంజీవరావు, కందుకూరి చరిత్ర పరిశోధకుడు, రాజమహేంద్రవరం

పరిశోధకులకు ఉపయోగం..



కందుకూరి జన్మగృహంలో వీరేశలింగం రచించిన కొన్ని ముద్రిత పుస్తకాలు భద్రపరిచాం. పరిశోధకులు ఎవరైనా వీటిని అధ్యయనం చేయవచ్చు. ప్రతి రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వంకాయలవారి వీధిలో కందుకూరి జన్మగృహం సందర్శించవచ్చు.

- కె.తిమ్మరాజు, సహాయ సంచాలకుడు, పురావస్తుశాఖ

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రతిష్ఠాత్మకం

కాకినాడ నగరం, సాంబమూర్తినగర్: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికను కూటమి పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని కాకినాడ నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎన్నికల జిల్లా పరిశీలకుడు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రంగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా తెదేపా కార్యాలయంలో గురువారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై నియోజకవర్గస్థాయి కూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు. కొండబాబు మాట్లాడుతూ అభ్యర్థిగా ప్రకటించిన పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఆయనను గెలిపిస్తే నిరుద్యోగులు, యువత, ప్రజా సమస్యలపై తన వాణి వినిపిస్తారన్నారు. రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రులను ఓటర్లుగా చేర్పించి రాజశేఖర్ విజయానికి కృషి చేయాలన్నారు. పౌర సరఫరాల కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్, భాజపా జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ మాట్లాడుతూ కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. అభ్యర్థి రాజశేఖర్ మాట్లాడుతూ తనకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని హామీ ఇచ్చారు. సమావేశంలో కూటమి నాయకులు మల్లిపూడి వీరు, తలాటం సత్య, పెంకె శ్రీనివాస బాబా, నాగేశ్వరరావు, అడబాల సత్యనారాయణ, మెసంగి ఆదినారాయణ, గ్రంధి బాబ్జి, సుంకర తిరుమలకుమార్, కొండమూరి సత్యనారాయణ, కొండేటి గంగాధరం, నల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల పరిశీలకుడు రంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే కొండబాబు, ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్ తదితరులు

ఇంకెన్నాళ్లు.. నిరీక్షణ..?

ఉప్పాడ రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు(ఆర్వోబీ) రోజురోజుకూ ఆలస్యమవుతున్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో హడావుడి చేసినా.. ప్రజలకు సౌకర్యం కల్పించలేదు.

- న్యూస్‌టుడే, పిఠాపురం



ఉప్పాడ రైల్వేగేటు వద్ద ట్రాక్‌పై రైలు నడుస్తుండగా నిలిచిన వాహనాలు

పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ రైల్వేగేటు వద్ద నిత్యం ఎండలో గంటలపాటు వాహనదారులు, ప్రయాణికులు వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంటోంది. ఇక్కడి పట్టాల మీదుగా విజయవాడ-విశాఖపట్నం మీదుగా వెళ్లే రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. ఇటీవల రైళ్ల సంఖ్య పెరిగింది. దాంతో గేటుపడిన ప్రతిసారీ ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ఈ మార్గంలో కొత్తపల్లి, తొండంగి, కాకినాడ గ్రామీణ మండలాలకు రాకపోకలు సాగుతుంటాయి. విశాఖ, తుని, కొత్తపల్లి, కాకినాడ నుంచి పిఠాపురం పట్టణానికి వాహనదారులు వస్తుంటారు. ఉప్పాడ, కాకినాడ బీచ్‌కు, పేపర్‌మిల్లు, జాందానీ చీరల కొనుగోలుకు నిత్యం వేల సంఖ్యలో ప్రయాణాలు చేస్తుంటారు. గేటు పడితే అంబులెన్సులు సైతం నిలిచిపోవాల్సిందే. పరీక్షలకు వెళ్లే విద్యార్థులు ఏటా యాతన పడుతున్నారు.

20 ఏళ్లుగా యాతన..

రైల్వే క్రాసింగ్ నంబరు 431 మీదుగా రోజూ ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు 51 సార్లు, గూడ్సు రైళ్లు 20 సార్లు మొత్తం 71 సార్లు తిరుగుతుంటాయి. నిత్యం గేటు వేసినప్పుడల్లా ఆటోలు, కార్లు, వ్యాన్లు, కంటెయినర్లు, ద్విచక్ర వాహనాలు, సైకిళ్లు, పాఠశాలల బస్సులు గంటలపాటు నిలిచిపోతున్నాయి. గేటు మొరాయిస్తే ఇక అంతే. గేటు పడినప్పుడల్లా రెండుమూడు రైళ్లు వచ్చేస్తుంటాయి. ట్రాఫిక్ క్లియర్ కాకుండానే మరో రైలు వస్తుంటుంది.

● 2014 నుంచి 2019 మధ్య రూ.40 కోట్లు అవసరం కాగా గత వైకాపా ప్రభుత్వ హయాంలో రూ.60 కోట్లుగా గుర్తించారు. 2023లో 'సేతు బంధన్' పథకం కింద ఉప్పాడ రైల్వేగేటు మీదుగా ఆర్వోబీ నిర్మాణానికి కేంద్రం రూ.45 కోట్లు ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణకు రూ.39 కోట్లు కేటాయించామంది తప్పితే.. నిధులు ఇవ్వలేదు. దాంతో మరో రూ.11 కోట్లను కేంద్రం కేటాయించింది. ప్రస్తుతం కేంద్రం రూ.56 కోట్లు మంజూరు చేసింది. రెవెన్యూ అధికారులు భూసేకరణ చేశారు. ప్రైవేటు వ్యక్తుల భూమి సేకరణలో ఇబ్బందులున్నాయి.

భూసేకరణ పూర్తి

రైల్వేవంతెన నిర్మాణానికి ఏడాది క్రితమే భూసేకరణ పూర్తయ్యింది. ఇటీవల రైతులు, దుకాణదారులతో ఆర్డీవో సమావేశం నిర్వహించారు. భూసేకరణ నిధులు మంజూరైన వెంటనే పనులు మొదలవుతాయి.

- లోవరాజు, ఏఈ, ర.భ శాఖ, పిఠాపురం

అంతర్ కళాశాలల బాస్కెట్‌బాల్ పోటీలు

నన్నయ విశ్వవిద్యాలయం(రాజానగరం): నన్నయ విశ్వవిద్యాలయంలో అంతర్ కళాశాలల పురుషుల బాస్కెట్‌బాల్ పోటీలు, విశ్వవిద్యాలయ జట్టు ఎంపిక కార్యక్రమానికి గురువారం వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు హాజరయ్యారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని నన్నయ విశ్వవిద్యాలయం తరఫున 42 రకాల క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. రెండు రోజులు యూనివర్సిటీలో నిర్వహించనున్న ఇంటర్ కాలేజియేట్ బాస్కెట్‌బాల్ మెన్ టోర్నమెంట్ కమ్ యూనివర్సిటీ టీమ్ సెలక్షన్స్‌కు ఆయా కళాశాలల నుంచి 13 జట్లు, 12 మంది వ్యక్తిగత క్రీడాకారులు హాజరయ్యారన్నారు. నాకౌట్ కమ్ లీగ్ పద్ధతుల ద్వారా పోటీలు నిర్వహిస్తారని తెలిపారు.

అథ్లెటిక్స్.. ఆట అదుర్స్

శ్యామలా సెంటర్ (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపిక గురువారం రాజమహేంద్రవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభమైంది. రెండురోజుల పాటు జరగనున్న ఈ పోటీలకు తొలిరోజు అండర్-14 విభాగంలో పరుగు, హర్డిల్స్, హైజంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావలిన్‌త్రో తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించి క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి తెలిపారు.

యువత భవితకు 'దిక్సూచి'

రాజమహేంద్రవరం సాంస్కృతికం: నిపుణులు చెప్పిన మాటలు ఉజ్వల భవితకు బాటలు వేస్తాయని లయన్స్ క్లబ్ జిల్లా మొదటి ఉపగవర్నర్ వజ్రపు కోటేశ్వరరావు పేర్కొన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ కార్యక్రమంలో భాగంగా లయన్స్ క్లబ్ రాజమండ్రి వజ్రం, లయన్స్ క్లబ్ రాజమండ్రి కడియం హార్టికల్చర్ సహకారంతో నగరంలోని ఆనం కళాకేంద్రంలో రెండురోజుల పాటు నిర్వహించే దిక్సూచి కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస నిపుణులతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆదిత్య కళాశాల డైరెక్టర్ ఎస్.పి.గంగిరెడ్డి మాట్లాడుతూ తెలిసిన అంశాలను వేదికపై ప్రదర్శించేందుకు విద్యార్థులు భయపడకూడదన్నారు. క్లబ్ రీజియన్ ఛైర్‌పర్సన్ ఎం.వాణిశ్రీ, జిల్లా పూర్వపు గవర్నర్ మాటూరి మంగతాయారు, లయన్ వేలూరి సూర్యనారాయణ, లింగమల్లు కృష్ణమూర్తి, బి.వి.ఎన్.రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ లక్ష్మారెడ్డి, అడ్వైజర్ విశ్వేశ్వరరావు తదితరులు మాట్లాడారు. నగరంలోని పలు కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు గంపా నాగేశ్వరరావు, వేణు కల్యాణ్, సినీనటుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు కె.వి.ప్రదీప్, ఐఏఎస్ కోచింగ్ నిపుణురాలు, విద్యావేత్త బాలలత, చార్టెడ్ అకౌంటెంట్ రాహుల్ వేదాంతం తదితరులు యువతకు మార్గనిర్దేశం చేశారు.

Collector's Office, Kakinada

Ref. Coordn/(Elecs)-1/188/2024. Dt. 24-10-2024

ANNEXURE A-1

ELECTION COMMISSION OF INDIA

Revision of Electoral Rolls for East-West Godavari Graduates' Constituency of Andhra Pradesh Legislative Council

Notice under rule 31(4) of the Registration of Electors Rules, 1960

In pursuance of rule 31(4) of the Registration of Electors Rules, 1960, the Electoral Registration Officer of East-West Godavari Graduates' Constituency vide Public notice Ref.Coordn/(Elecs)-1/188/2024, Dt.30-09-2024, called upon every person entitled to be registered In the electoral roll of the relevant Graduates' Constituency mentioned above, to send to, or deliver at, ERO's Office on or before 06-11-2024 (i.e., the last date of receipt of applications) application In Form-18 appended to the Registration of Electors Rules, 1960 and reproduced In the second schedule of the said notice published in the edition dated 30th September, 2024 of (1) Eenadu and (2) The New Indian Express News Papers.

All the above mentioned persons may submit their applications In Form-18 on or before 06-11-2024 (ie., the last date of receipt of applications), If not already done.

The said details are also available in the official website of the Chief Electoral Officer, Andhra Pradesh at www.ceoandhra.nic.in

Sd/- **Electoral Registration Officer**
East-West Godavari Graduates' Constituency &
District Revenue Officer, Kakinada.

ఉచిత ఇసుక సరఫరా వేగవంతానికి డిమాండ్

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికులకు పనులు లభించేలా కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక సరఫరాను వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ, ఇతర రంగాల కార్మికుల సంఘం ప్రతినిధులు ఆందోళన నిర్వహించారు. చేబ్రోలులోని పవన్‌కల్యాణ్ నివాసం ఎదుట గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి మండలాలకు చెందిన సంఘం ప్రతినిధులు గురువారం నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం జనసేన జనవాణి కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు. సంఘం పిఠాపురం పట్టణ అధ్యక్షుడు డి.సత్యనారాయణ, చేబ్రోలు నాయకుడు పి.రమణ, యు.కొత్తపల్లి మండల నాయకులు సీహెచ్ సాంబశివ మాట్లాడారు. అధికారంలోకి వస్తే ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని ప్రకటించి నాలుగు నెలలవుతున్నా భవన నిర్మాణదారులకు ఇసుకను అందుబాటులోకి తీసుకురాకపోవడంతో కార్మికులు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, పెండింగ్ క్లెయిమ్‌లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కె.చిన్న, విశ్వనాథం, కె.రమణ, నందీశ్వరరావు, పి.వీరబాబు, ఎస్.సత్తిబాబు, కేవీపీ సత్యనారాయణ, డి.నాగేశ్వరరావు, వాసు, సత్తిబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



చేబ్రోలులో నిరసన తెలుపుతున్న కార్మికులు

రైతులపై వైకాపా కార్యకర్తల దాడి..!

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: ఓ యువరైతుపై పలువురు దుర్భాషలాడి, దాడిచేసిన ఘటన గురువారం కాకినాడలో జరిగింది. బాధిత రైతులు తెలిపిన వివరాల మేరకు.. పిఠాపురం మండలం విరవాడకు చెందిన పరస శివదుర్గ తండ్రి లక్ష్మణ్ కరోనాతో చనిపోయారు. కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రైతుబజారులో ఆయన నిర్వహించే కూరగాయల దుకాణం అతని కుమారుడు శివదుర్గకు ఇవ్వాలని స్థానిక రైతులంతా కలిసి జేసీకి వినతిపత్రం ఇచ్చారు. జేసీ సూచనల మేరకు దుకాణం కేటాయించడంతో గురువారం నుంచి వ్యాపారం ప్రారంభించాడు. అదే సమయంలో సర్పవరానికి చెందిన తలిశెట్టి వీరబాబు, మరో ఎనిమిదిమంది శివదుర్గను దూషించి, కూరగాయలు చెల్లాచెదురుగా పడేశారు. రైతుబజారు ఎస్టేట్ అధికారులను సైతం తిట్టారు. స్థానిక రైతులనూ అసభ్య పదజాలంతో దూషించారు. ఈ ఘటనపై శివదుర్గతో పాటు 30 మంది రైతులు రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ వీరబాబుతో పాటు మరికొంతమంది వైకాపా అనుచరులు గత పాలనలో ఇంగ్లీషు దుకాణాలు లీజుకు తీసుకున్నారన్నారు. ఆ గడువు ముగిసిందని, అధికారులే దుకాణం కేటాయించినా తమపై దాడి చేశారని వాపోయారు.



టూటౌన్ పోలీసుస్టేషన్ ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధిత రైతులు

ప్రభుత్వ ఐటీఐ ఉద్యోగుల జిల్లా కార్యవర్గం ఎన్నిక

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఐటీఐ, డీఎల్‌టీసీల అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవమైంది. కాకినాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో గురువారం ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. అతిథులుగా కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ ఎంవీజీ వర్మ, అసోసియేట్ రాష్ట్ర నాయకురాలు జి.మంగతాయారు, జిల్లా గౌరవాధ్యక్షుడు ఈజే మోహనరావులు హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు ఎంఎన్ఎస్.మూర్తి, ఉపాధ్యక్షులు జి.విజయ్‌కుమార్, ఎం.ముక్తేశ్వరరావు, కార్యదర్శి పీజే.శ్రీనివాసబాబు, కోశాధికారి కె.శ్రీనుకుమార్, సహాయ కార్యదర్శులు ఎస్.సౌజన్య, ఎం.పద్మ, కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కాకినాడ యూనిట్ అధ్యక్షుడిగా వీవీఎల్.నరసింహారావు, కార్యదర్శిగా ఎస్ఏ.శంకరరావు, కోశాధికారిగా జి.శ్రీనివాసరావు తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉద్యోగులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి, ఐటీఐ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.



ఎన్నికైన సభ్యులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ వర్మ తదితరులు

ఉద్యోగినుల తక్షణ భద్రతకు చర్యలు

కాకినాడ కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల భద్రతకు తక్షణ చర్యలు చేపట్టాలని ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం రాష్ట్ర ఛైర్‌పర్సన్ పి.లక్ష్మి కోరారు. గురువారం రెవెన్యూ భవన్‌లో ఏపీ జేఏసీ అమరావతి జిల్లా అధ్యక్షుడు పితాని త్రినాథరావు ఆధ్వర్యంలో జిల్లా మహిళా విభాగం సమావేశం నిర్వహించారు. ఈ విభాగం రాష్ట్ర కార్యదర్శి సునీత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ లక్ష్మి మాట్లాడుతూ మహిళా ఉద్యోగుల భద్రతకు ప్రతీ కార్యాలయంలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయాలన్నారు. ప్రసూతి సెలవులు, ఇతర రాయితీలు అమలు చేయాలన్నారు. అనంతరం వివిధ రెవెన్యూ డివిజన్లలో మహిళా విభాగంలో ఖాళీ పోస్టులకు కో-ఆప్షన్ విధానంలో ప్రతినిధులను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. నాగవేణి, రమాదేవి, జానకి, లక్ష్మి, రామశ్రీలక్ష్మి, శ్రీదేవి, సౌమ్య, ప్రత్యేష, కౌసల్య, సంధ్య, ఇంద్రాణి, గిరిజ, ప్రజ్ఞ, వెంకటలక్ష్మి, సౌమ్య, మాణిక్యం, అనురాధ ప్రతినిధులుగా ఎన్నికయ్యారు. కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం అందజేశారు.



డివిజన్ యూనిట్లకు ఎన్నికైన మహిళా విభాగం ప్రతినిధులు

వ్యక్తి మృతిపై అనుమానాలు.. ఇద్దరి అరెస్టు

తొండంగి, న్యూస్‌టుడే: తొండంగి మండలం ఏవీనగరం గ్రామానికి చెందిన మధు అనే వ్యక్తి వారం కిందట మృతి చెందారు. తాజాగా పలు అనుమానాలు వ్యక్తమవడంతో ఇద్దరిని అరెస్టు చేశామని ఎస్సై జగన్మోహనరావు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలివీ.. ఏవీనగరానికి చెందిన బత్తిన మధు (38)కు అదే గ్రామానికి చెందిన శిరీషతో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికొక కుమార్తె ఉన్నారు. శిరీష ఉపసర్పంచి (వైకాపా)గా ఉంటూనే శంఖవరం మండలం సీతంపేటలో ఓ ఆస్పత్రిలో ఉద్యోగం చేస్తున్నారు. ఇదే ఆస్పత్రిలో పని చేస్తున్న రౌతులపూడి మండలం శృంగవరం గ్రామానికి చెందిన పీతల ప్రశాంత్‌తో కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. భర్త మందలించడం, పలుమార్లు ఘర్షణలు జరిగాయి. అయితే గత శుక్రవారం మధుకు అనారోగ్యం రావడంతో సీతంపేట ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించి ఇంటికి తీసుకురాగా అదే రాత్రి మృతి చెందాడన్నారు. కుటుంబసభ్యులు, బంధువులు ఆ రోజే దహన సంస్కారాలు నిర్వహించారు. శిరీషకు వివాహేతర సంబంధం ఉండడంతో ప్రియుడితో కలిసి భర్తను కుట్ర పన్ని హత్య మార్చారని కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా గురువారం అర్ధరాత్రి దాటాక (రెండు గంటల సమయంలో) ఏవీనగరంలో ఆమె ఇంట్లో వీరిద్దరూ కలిసి ఉండగా కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పట్టుకున్నారు. మధుది సహజ మరణమా.. హత్యా అనేది తేలాల్సి ఉంది. అనుమానితులు ఇద్దరినీ అరెస్టు చేసి విచారిస్తున్నామని మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం చేస్తామని ఆ నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



బత్తిన మధు (పాత చిత్రం)

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	11,500
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	16,000
గటగట	13,500
కొత్తకాయ: గండేరా	15,500
గటగట	13,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	12,000-13,500
కొత్త (పచ్చి) కాయ	11,500-12,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారం రేటు	130-00
రిటైల్ లైవ్	152-00
డ్రెస్డ్	220-00
స్కిన్‌లెస్	251-00

కాకినాడ

నగరంలో సినిమాలు గాంధీనగర్: ఆనంద్ సినిమాస్ 4ప్లెక్స్- వెనమ్, విశ్వం, వెట్టయాన్ ది హంటర్, లగ్గం, ఎంతపని చేశావ్ చంటి ఇద్దరు, జనక అయితే గనక, సత్య సుందరం, దేవి మల్టీప్లెక్స్ 4ప్లెక్స్- వెనమ్, లగ్గం, గ్యాంగ్‌స్టర్, విశ్వం, లక్ష్మీ- పొట్టేల్, సత్యగౌరి - వెనమ్, తిరుమల - వెట్టయాన్ ది హంటర్, సిటీ1- నరుడి బ్రతుకు నటన(ఉ.సా), జనక అయితేగనక(మ.రా), సిటీ 2- స్వాగ్, శ్రీప్రియ - వెనమ్, పద్మప్రియ- దేవర పార్ట్ 1, సూర్య1(వాకలపూడి) - వెనమ్, సూర్య 2- దేవర పార్ట్ 1, శ్రీశ్రీనివాస(వేలంగి)- పొట్టేల్.

రైతుబజార్‌లో నిన్నటి కూరగాయల ధరలు(కిలో.. రూ.ల్లో)

గాంధీనగర్: టమాటా - 36, వంకాయలు - 50,68, బెండకాయలు - 56, పచ్చిమిర్చి - 42,48, కాకరకాయ - 34, బీర - 38,48 కాలీఫ్లవర్ - 15,20, క్యాబేజీ - 40, క్యారెట్ - 44, దొండకాయలు - 30, బంగాళదుంపలు - 30,36, ఉల్లి - 45,50, గోరుచిక్కుళ్లు - 34, దోసకాయలు - 44, ఆనపకాయ - 30,35, పొట్లకాయ - 20,25, అరటికాయ - 6,7, చిక్కుళ్లు - 120, చేమదుంపలు - 30,44, మునగకాడలు - 5,6, బీట్‌రూట్ - 44, కీరదోస - 26, బీన్స్‌గింజలు - 130, అల్లం - 60, క్యాప్సికం - 100, బొబ్బర్లు - 56, చిలకడదుంపలు - 34, నిమ్మకాయలు(డజన్) - 24,48.




వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

సాంకేతిక అంశాలపై అవగాహన అవసరం

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: చదువుతోపాటు విద్యార్థులు అంతర్జాలంపై అవగాహన పెంచుకోవాలని దుర్గాప్రసాద్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.సంతోష్, సీఈవో ఎం.భాను ప్రియాంక సూచించారు. కాకినాడ జగన్నాథపురంలోని దుర్గాప్రసాద్ స్కూల్లో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాల వినియోగంతో కలిగే లాభాలు, నష్టాలు, సామాజిక మాధ్యమ ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు చేపట్టారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పేపకాయల సూర్యవెంకటచంద్ర(10వ తరగతి) ప్రథమ బహుమతి, ఆర్.తేజ కార్తిక్(8వ తరగతి) ద్వితీయ బహుమతి, కనకాల సాయిశ్రీ(9వ తరగతి) తృతీయ బహుమతి సాధించారు. 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను ఎండీ ఎం.సంతోష్, సీఈవో భానుప్రియాంక విజేతలకు అందజేశారు. అకడమిక్ హెడ్ వి.శంకరరావు, టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



విజేతలతో ఎండీ ఎం.సంతోష్, సీఈవో ఎం.భాను ప్రియాంక



బాల్యం.. బలహీనం

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: బాల్యాన్ని బలోపేతం చేయాలనేది అంగన్‌వాడీ కేంద్రాల ప్రధాన ఉద్దేశం. అయితే పేదరికం, తల్లిదండ్రుల్లో అవగాహన లేకపోవడం, పోషకాహారం పూర్తిస్థాయిలో అందకపోవడంతో బాల్యం బక్కచిక్కిపోతోంది. కాలానుగుణ వ్యాధులతో చిన్నారులు నీరసించిపోతున్నారు. పిల్లలు వయసుకు తగ్గ ఎత్తు, బరువు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. గత నెలలో చేపట్టిన సమగ్ర సర్వేలో ఈ వాస్తవాలు వెలుగు చూశాయి. పిల్లల బరువు, ఎత్తు, శారీరక పరిస్థితిని చూస్తున్నారు. పోషణ లోపంతో ఉన్నవారి వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్నారు.

ఇవీ కారణాలు..

● పుట్టుకతోనే ఆహార లోపం ఉండటం. ● తల్లిదండ్రులకు సరైన అవగాహన లేకపోవడం. ● వ్యక్తిగత శుభ్రత పాటించకపోవడం. ● నులిపురుగుల సమస్యతో బాధపడుతుండటం. ● వివిధ కారణాలతో కేంద్రాలకు గైర్హాజరు అవుతుండటం. ● పలు కారణాలతో చిన్నారులు అందరికీ పోషకాహారం అందకపోవడం వంటి కారణాలతో సమస్య నెలకొంటోందని గుర్తించారు. ఇటువంటి వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నామని ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు. ఇంటింటా తిరిగి అవగాహన కల్పిస్తున్నామని అంటున్నారు.

పునరావాస కేంద్రంలో..

లోపం మరీ ఎక్కువగా ఉన్న వారిని గుర్తించి పోషకాహార పునరావాస కేంద్రంలో ఉంచి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులకు కాకినాడ జీజీహెచ్‌లో పోషకాహార పునరావాస కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అక్కడికి పిల్లలను తీసుకెళ్తే కనీసం పదిహేను రోజులపాటు పరిశీలనలో ఉంచుతారు. ప్రత్యేక ఆహారం అందిస్తారు. చిన్నారులతోపాటు సహాయకులకు భోజనం పెడతారు. వాళ్లకు రోజుకు రూ.100 చొప్పున అందిస్తారు. పిల్లలు పూర్తిగా కోలుకునే వరకు కేంద్రం వద్దే ఉంచుతారు. అనంతరం పిల్లలను ఇంటికి పంపేముందు తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. ఏ సమయంలో ఏ ఆహారం అందించాలి, ఎలాంటి పోషక విలువలు అందించాలి తదితర వివరిస్తున్నారు.

తల్లులకు అవగాహన కల్పిస్తున్నాం..

పిల్లల్లో పోషణ లోపం, ఎత్తుకు తగ్గ బరువు, వయసుకు తగ్గ ఎత్తు లేనివారు వివరాలు నమోదు చేశాం. వారిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. పోషకాహార మాసోత్సవాల్లో తల్లులకు అవగాహన కల్పిస్తున్నాం. లోపం మరీ ఎక్కువగా ఉన్న పిల్లలను జీజీహెచ్‌లోని పోషకాహారం పునరావాస కేంద్రానికి పంపిస్తున్నాం. దీనిపై అవగాహన కల్పిస్తున్నాం.

- జ్యోతి, సీడీపీవో, కాకినాడ అర్బన్ ఐసీడీఎస్



పునరావాస కేంద్రంలో శిశువును పరీక్షిస్తున్న సిబ్బంది

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

బాలాజీ చెరువు: పవర్‌హౌస్ విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎన్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు నూకాలమ్మగుడి, గోపాలకృష్ణవీధి, దంటువారివీధి, మునసబు వీధి, ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు రామారావుపేట, మూడు దీపాల కూడలి, పశువుల ఆసుపత్రి రోడ్డు, శేషసాయి, సాంబమూర్తి వీధుల్లో, ఉదయం 7 నుంచి 10 గంటల వరకు రాగంపేట, రెల్లివీధి, జ్యోతుల మార్కెట్, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రంగయ్యనాయుడు వీధి, పెద్ద మార్కెట్, యాళ్లవారి వీధి ప్రాంతాల్లో సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు.

26న సోమసుందర్ శతజయంతి సభ

గాంధీనగర్, న్యూస్‌టుడే: కేంద్ర సాహిత్య అకాడమీ, క్రియా సొసైటీ కాకినాడ వారి ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీవేత్త ఆవంత్స సోమసుందర్ శతజయంతి సభ శనివారం నిర్వహించనున్నట్లు క్రియా కార్యదర్శి జగన్నాథరావు తెలిపారు. కాకినాడ గాంధీభవన్‌లో ఉదయం 10గంటలకు జరుగుతుందన్నారు. పిఠాపురానికి చెందిన సోమసుందర్ చేసిన రచనలు ఎంతగానో పేరొందాయన్నారు. సమావేశాల్లో సాహిత్య అకాడమీ, తెలుగు సలహా సంఘ కన్వీనర్ సి.మృణాళిని, విమర్శకులు చందు సుబ్బారావు, సాహితీ ప్రముఖులు కె.వెంకట్రావు, ఎర్రమిల్లి ఉషాకుమారి, సిదారెడ్డి, సీతారామస్వామి, ఈశ్వరరెడ్డి, బొల్లోజుబాబ, వాడ్రేవు వీరలక్ష్మి, కె.నాగమురళీశంకర్, నందూరి రాజగోపాల్ తదితరులు పాల్గొంటారన్నారు.

చరవాణి విపరీత వినియోగంతో అనర్థాలు


గాంధీనగర్, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి జీవితంలో జ్ఞానం పెంచుకోవాలని, దానికి తగినంత కృషి చేయాలని అప్పుడే అభివృద్ధి సాధ్యమని లయన్స్‌క్లబ్ సీనియర్ సభ్యుడు జీవీఎస్ గాంధీజీ పేర్కొన్నారు. గురువారం ఐక్యరాజ్యసమితి దినోత్సవం సందర్భంగా వికాస్ జూనియర్ కళాశాలలో లయన్స్‌క్లబ్ కాకినాడ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గాంధీజీ, అతిథిగా సీనియర్ సభ్యుడు జీఎల్.జగన్నాథరావులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ చరవాణుల వినియోగం తగ్గించుకోవాలన్నారు. చదువుపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. డైమండ్ జూబ్లీ ఇయర్ అధ్యక్షుడు మోహన్‌కుమార్ అధ్యక్షత వహించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ప్రాజెక్టు ఛైర్మన్ సూర్యనారాయణ, ఎంవి.రమణ పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం వద్ద మద్యం దుకాణం వద్దు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: గాంధీనగర్ ప్రధాన కూడలిలోని గాంధీజీ విగ్రహానికి అతి సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని ఎల్విన్‌పేట, గాంధీనగర్‌కు చెందిన మహిళలు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. 1940వ దశకంలో గాంధీ ఇక్కడకు వచ్చారని, ఆయన జ్ఞాపకంగా ఇక్కడ గాంధీజీ విగ్రహాన్ని పెట్టారన్నారు. ఆ ప్రదేశంలో దుకాణం పెట్టడం దారుణమన్నారు. ఇక్కడకు సమీపంలో క్రైస్తవ ప్రార్థనా మందిరం ఉందని, ప్రసూతి ఆసుపత్రి నిర్వహిస్తున్నారని తెలిపారు. జనంతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో పెట్టడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే తరలించాలని డిమాండ్ చేశారు. అనంతరం సంయుక్త కలెక్టర్ రాహుల్‌మీనాకు వినతిపత్రం అందజేశారు.

క్షేత్ర సహాయకులపై వేధింపులు ఆపాలి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాజకీయ వేధింపులు ఆపాలని జాతీయ ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు నిరసన తెలిపారు. జిల్లా క్షేత్ర సహాయకుల సంఘం ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లోని డ్వామా కార్యాలయంలో పీడీ అడపా వెంకటలక్ష్మికి వినతిపత్రం ఇచ్చారు. సంఘ అధ్యక్షుడు కడమటి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో పేదలకు ఉపాధి హామీ పథకం ద్వారా పనిదినాలు కల్పించడమే కాకుండా, మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. చాలీచాలనీ వేతనాలతో పనిచేస్తుంటే, ప్రభుత్వాలు మారిన ప్రతీసారి క్షేత్ర సహాయకులను మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 18 ఏళ్లుగా ఈ పథకంలో పనిచేస్తున్నామని, అవినీతికి పాల్పడినా, విధుల్లో నిర్లక్ష్యం వహించినా, తగిన ఆధారాలు చూపించి మాత్రమే తొలగించాలన్నారు. తప్పుడు ఫిర్యాదులు, బెదిరింపులతో ఇబ్బంది పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం మండల స్థాయిలో బదిలీలకు అవకాశం కల్పించి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సంఘ ప్రతినిధులు ఆర్ఎస్ఎస్ నారాయణ, ఏ.శ్రీను, జి.గోపి, జీపీ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



డ్వామా పీడీకి వినతిపత్రం ఇస్తున్న సహాయకులు

నర్సుల సమస్యలు పరిష్కరించాలని ఆకాంక్ష

మసీదు సెంటర్, న్యూస్‌టుడే: ఏపీ ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సంఘ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గ సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. కాకినాడ జీజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్లు గ్రేడ్-1 సంధ్యారాణి, గ్రేడ్-2 జయశ్రీ, కార్యాలయ సిబ్బంది గురువారం వారిని సత్కరించారు. అధ్యక్షురాలు బూరిగ విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలు బోడే రాణి, కార్యదర్శి గట్టు ప్రమోద, కోశాధికారి కాకి వెంకట పరమేశ్వరి, సభ్యులు వి.ఇందిరా, కె.దేవి, జి.వీరలక్ష్మి, బి.అక్కమ్మ, ఎం.సుజాత తదితరులను అభినందించారు. నర్సుల సమస్యలను పరిష్కరించే విధంగా కృషిచేయాలని ఆకాంక్షించారు. అనంతరం ఆర్ఎంవో డా.కె.అనిత నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.



కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

కచేరిపేట, యూటీఎఫ్ భవనం వద్ద..

కాకినాడ కలెక్టరేట్: స్థానిక కచేరిపేట, యూటీఎఫ్ భవనం చెంతన మద్యం దుకాణం వద్దంటూ శ్రామిక మహిళలు గురువారం నిరసన తెలిపారు. యూటీఎఫ్ మహిళా నేతలు దేవి, నసీఫా, భువనేశ్వరి, అప్సరి జహరి, శ్రామిక మహిళా శాఖ ప్రతినిధులు నర్ల ఈశ్వరి, సీహెచ్.వేణి, భూలక్ష్మి, రాణి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. మహిళలు ఇటుగా వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే తరలించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం

గాంధీనగర్: రాష్ట్రస్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో కాకినాడ శ్రీచైతన్య జూనియర్ కళాశాల ఇంటర్ విద్యార్థిని వడిగల వీర వర్షిణి మొదటిస్థానంలో నిలిచి, బంగారు పతకం సాధించినట్లు విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం హరిప్రసాద్ తెలిపారు. ఆమెను అభినందించారు. ఆమెకు అవసరమైన అన్ని రకాల వనరులు సమకూరుస్తామన్నారు. ఏజీఎం రాంబాబు, ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, అధ్యాపకులు, పాల్గొన్నారు.

అక్నూ కాకినాడ పీజీ క్యాంపస్ ప్రిన్సిపల్‌గా కమలకుమారి

సర్పవరం జంక్షన్: కాకినాడ గ్రామీణం తిమ్మాపురంలోని ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయం కాకినాడ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా ప్రొఫెసర్ కమలకుమారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. క్యాంపస్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

పోలియోపై అవగాహన అవసరం

సాంబమూర్తినగర్: పోలియో దినోత్సవం సందర్భంగా అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పోలియోపై గురువారం అవగాహన కల్పించారు. మైక్రో బయాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డా.వి.అనంతలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రంగరాయ వైద్య కళాశాల మైక్రో బయాలజీ హెడ్ డా.నిర్మల గ్రేస్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యాధి లక్షణాలు, తీవ్రత తగ్గించడానికి తీసుకోవల్సిన జాగ్రత్తలు, టీకా గురించి వివరించారు. వ్యాధి నిర్మూలనలో సాధించిన పురోగతిని వివరించారు. విద్యార్థినులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ డా.ఎం.సువర్చల, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ వసంతలక్ష్మి, అకడమిక్ కోఆర్డినేటర్ డా.లావణ్య, డా.కె.శ్యామల, డా.జి.అనిత, డి.జయశ్రీ పాల్గొన్నారు.

పోటీతత్వంతో సమగ్ర అవగాహన

సాంబమూర్తినగర్, కాకినాడ నగరం: సమగ్ర జ్ఞాన అవగాహనలో విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ పేర్కొన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి, స్వర్ణాంధ్ర 2047 అంశాలపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు డీఈవో కార్యాలయంలో గురువారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డీఈవో మాట్లాడుతూ విద్యార్థి దశలో పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. గాంధీనగర్ పాఠశాల విద్యార్థులు ఎం.విస్సు, డి.సింధూజ, ఆర్.సహస్ర పోటీల్లో గెలుపొందారు. జీసీడీవో ఉమామహేశ్వరి, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, గైడ్ టీచర్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఈవో రమేష్

పరిమితికి మించిన ప్రయాణికులతో ప్రమాదం

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: ఆటోడ్రైవర్లంతా తప్పనిసరిగా లైసెన్సు, వాహన రికార్డులన్నీ కలిగి ఉండాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని ట్రాఫిక్-1, 2 సీఐలు ఎన్.రమేష్, రామారావు సూచించారు. గురువారం స్థానిక బాలాజీచెరువు టీటీడీ కల్యాణ మండపం ప్రాంగణంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు డీఎస్పీ రఘువీర్ విష్ణు పర్యవేక్షణలో ట్రాఫిక్-1, 2 సీఐలు ఎన్.రమేష్, రామారావు, వన్‌టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు ట్రాఫిక్ నియమాలపై ఆటోడ్రైవర్లు, యూనియన్ సభ్యులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమాలు, రోడ్డుప్రమాదాల నిర్మూలనపై వివరించారు. ఆటోలో డ్రైవర్‌కు ఇరువైపులా, ఆటో వెనుక భాగంలో తీసుకెళ్లకూడదన్నారు. విద్యార్థుల్ని తీసుకెళ్లే ఆటోలో ఆరుగురికి మించి ఎక్కించుకూడదన్నారు. మద్యం సేవించి ఆటో నడపరాదన్నారు. అనంతరం పోలీసు అమరవీరుల దినోత్సవం-2024లో భాగంగా ర్యాలీని నిర్వహించారు. ఆటోడ్రైవర్లు, ట్రాఫిక్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో ఆటోడ్రైవర్లు, ట్రాఫిక్ పోలీసులు

యువత అవకాశాలు అందిపుచ్చుకోవాలి

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ జీవనోపాధికి బాటలు వేసుకోవాలని ఆర్టీసీ కాకినాడ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు పేర్కొన్నారు. కాకినాడ ఆర్టీసీ బస్టాండులో హెవీ డ్రైవింగ్ శిక్షణ తరగతులు 18వ బ్యాచ్ ముగింపు సమావేశం డిపో అసిస్టెంట్ కమిషనర్ ఎంయూవీ మనోహర్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీపీటీవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీ మనోహర్ మాట్లాడుతూ నిరుద్యోగుల ఉపాధికి ఈ శిక్షణ ఎంతో దోహద పడుతుందన్నారు. డీపీటీవో చేతులమీదుగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు అందజేశారు. డ్రైవింగ్ స్కూల్ ఇన్‌స్ట్రక్టర్ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.



ధ్రువపత్రాలు అందజేస్తున్న డీపీటీవో శ్రీనివాసరావు

చదరంగంలో చిచ్చర పిడుగు 'ధన్విన్ రామ్'

మసీదు సెంటర్: విజయనగరంలో జరిగిన అండర్-9 స్టేట్ ఓపెన్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కాకినాడకు చెందిన సీహెచ్ ధన్విన్ రామ్ ప్రతిభ కనబరిచి మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. రూ.నాలుగు వేల నగదు బహుమతి అందుకున్నాడు. పూణేలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కోచ్ లీలాకుమార్, తోటి క్రీడాకారులు చిన్నారిని అభినందించారు.



చిన్నారి వైద్యానికి రూ.70 వేల ఆర్థికసాయం

గాంధీనగర్, న్యూస్‌టుడే: శ్రీయువసేన సహాయనిధి ద్వారా అడ్డతీగల ప్రాంతానికి చెందిన ఎనిమిదేళ్ల చిన్నారి వైద్య నిమిత్తం రూ.70వేలు ఆర్థికసాయం అందజేశారు. అడ్డతీగలకు చెందిన డి.హేమ నవిత(8) ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యతో ఇబ్బంది పడుతుంది. 20 రోజుల క్రితం బాలిక తల్లి ఇదే వ్యాధితో కాకినాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈ నేపథ్యంలో బాలికకు మెరుగైన వైద్యం కోసం దాతల సహకారంతో సమకూర్చిన రూ.70 వేలను చిన్నారి తండ్రికి అందజేశారు.



ఏఎస్‌డీ కళాశాలలో గణిత అష్టావధానం

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డా.వి.అనంతలక్ష్మి అధ్యక్షతన గురువారం గణిత అష్టావధానం నిర్వహించారు. కళాశాల గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, సామర్లకోట మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు తోటకూర సాయిరామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమస్యాపూరణం, నిషిద్ధాంకం, దత్తాంకం, మనఃసంకల్పం, అప్రస్తుత ప్రసంగం, ఘనమూలం, వర్గాలబేధం అనే అంశాలతో అష్టావధానాన్ని అవలీలగా విద్యార్థులకు చేసి చూపించారు. వసంతలక్ష్మి, డా.సూర్యనారాయణ దేవర, గీత, శ్రీదేవి, డా.కృష్ణగాయత్రి, జయదేవ్, ప్రసాద్, శ్యామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోదండ రాముని కల్యాణం

గాంధీనగర్, న్యూస్‌టుడే: మెయిన్‌రోడ్డు సీతారామస్వామి ఆలయంలో గురువారం శ్రీరాముడి జన్మనక్షత్రమైన పునర్వసు సందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పాణింగపల్లి మాధవాచార్యుల నేతృత్వంలో కార్యక్రమం జరిగింది. మాంగళ్యధారణ, తలంబ్రాలు వంటివి శాస్త్రోక్తంగా నిర్వహించారు. తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈవో యర్రా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు, తలంబ్రాలు పంపిణీ చేశారు.



ఏఎన్ఎంపై చాకుతో దాడి

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: ఏఎన్ఎంపై చాకుతో దాడిచేసిన ఘటన కాకినాడలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కాకినాడ గాంధీనగర్ పరిధి చీడిగలపొరకు చెందిన పత్తికాయల సత్యవతి(46) 38వ వార్డులో ఏఎన్ఎంగా పనిచేస్తున్నారు. 25 ఏళ్ల క్రితం వివాహమైంది. కుటుంబ కలహాల నేపథ్యంలో మూడేళ్లుగా భార్యాభర్తలు వేర్వేరుగా ఉంటున్నారు. ప్రస్తుతం ఆమె అదే ప్రాంతంలోని పుట్టింట్లో ఉంటున్నారు. భార్యాభర్తల కేసు కోర్టులో ఉండగా అందులో సత్యవతి బావగారి కుటుంబ సభ్యులు సైతం ఉన్నారు. సదరు బావగారి అబ్బాయి అయిన జాన్ పెయింటు పనులు చేస్తుంటాడు. కలహాల నేపథ్యంలో జాన్ ఆమెపై చాకుతో దాడి చేశాడు. తల వెనుక, భుజంపై తీవ్రంగా పొడిచి గాయపరిచాడు. చికిత్స నిమిత్తం ఆమెను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.

చికిత్సపొందుతూ ఒకరి మృతి

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడకు చెందిన డి.కుమార్(30) జీజీహెచ్‌లో చికిత్సపొందుతూ మృతిచెందారు. రోడ్డుప్రమాదానికి గురైన ఘటనలో తీవ్రగాయాలవ్వడంతో ప్రథమచికిత్స అనంతరం ఈనెల 6న జీజీహెచ్‌లో చేర్చారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు. దీనిపై కాకినాడ పోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు.

బహిరంగ మద్యపానంపై కేసు



చర్చిస్క్వేర్ సెంటర్ వద్ద ఉద్యానంలో మద్యంసీసాలు

మసీదు సెంటర్: నగరంలో బహిరంగంగా మద్యం తాగుతున్న పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం రాత్రి జగన్నాథపురం, చర్చిస్క్వేర్ సెంటర్ వద్ద ఉద్యానం సమీపంలో మందుబాబులు మద్యం తాగారు. కాకినాడ ఒకటో పట్టణ పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. మెయిన్‌రోడ్డు, మసీదుసెంటర్ సమీపంలో మందుబాబులు ఒకరిపై మరొకరు దాడులు చేసుకున్నారు. పోలీసులు నిలువరిస్తున్నా గొడవపడ్డారు. రాత్రిపూట గస్తీ పెంచాలని, మందుబాబులకు అడ్డుకట్ట వేయాలని నగరవాసులు కోరుతున్నారు.

మురుగు పారేదెలా?

సాంబమూర్తినగర్, మసీదు సెంటర్: జగన్నాథపురం చర్చిస్క్వేర్ ప్రాంతంలో కాలువలు అధ్వాన స్థితిలో దర్శనమిస్తున్నాయి. శిథిలమై మురుగు ముందుకు పారట్లేదు. కాలనీల్లోని చిన్న కాలువలు సైతం వ్యర్థాలతో పూడుకుపోయాయి. మురుగు పారక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఫాగింగ్ చేయట్లేదని వాపోతున్నారు. రహదారుల పక్కన చెత్త నిల్వలు పేరుకుపోయాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



జెండా ప్రాంతంలో శిథిలమైన కాలువ



రోడ్డు పక్కన పేరుకుపోయిన వ్యర్థాలు..

కాలువలు పూడిపోయాయి..

ఈ ప్రాంతంలో కాలువలు శిథిలమై మట్టి, చెత్తతో పూడుకుపోయాయి. పారిశుద్ధ్య సిబ్బంది సకాలంలో వాటిని తొలగించడం లేదు. వచ్చినా పైపైన తీసి వెళ్లిపోతున్నారు. రాత్రిపూట దోమలతో ఇబ్బందులు పడుతున్నాం.

-నాగేంద్ర, స్థానికుడు

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

వేములవాడ విద్యార్థిని ప్రతిభ



పూర్ణశ్రీసాయికి జ్ఞాపిక అందిస్తున్న డీఈవో

కరప: జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో వేములవాడ జడ్పీ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని పూర్ణశ్రీసాయి ప్రథమ స్థానం సాధించడంపై హెచ్ఎం శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో కాకినాడలో గురువారం 'స్వర్ణాంధ్ర 2047' అంశంపై నిర్వహించిన పోటీల్లో ప్రథమ బహుమతిని డీఈవో రమేష్ చేతుల మీదుగా అందుకుంది.

అభివృద్ధి పనులకు శ్రీకారం



పనులు పరిశీలిస్తున్న ఇంజినీరు కృష్ణమోహన్ తదితరులు

గొల్లప్రోలు: గొల్లప్రోలు పీహెచ్‌సీకి వెళ్లే మార్గంలో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ అరిగెల అచ్చియమ్మ, మండల ఇంజినీరు కృష్ణమోహన్ గురువారం పరిశీలించారు. రూ.4 లక్షల మండల పరిషత్ సాధారణ నిధులతో పనులు చేపట్టారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. తహసీల్దారు, యూపీహెచ్‌సీ భవనాలను ఇంజినీరింగ్ అధికారులు గురువారం పరిశీలించారు.

అమరవీరుల వారోత్సవాల్లో వ్యాసరచన పోటీలు



పరిశీలిస్తున్న అడిషనల్ కమాండెంట్ దేవానందరావు

సర్పవరం జంక్షన్: కాకినాడ గ్రామీణ రమణయ్యపేటలోని ఏపీఎస్పీ మూడో బెటాలియన్‌లో గురువారం అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని అడిషనల్ కమాండెంట్ ఎస్.దేవానందరావు ఆధ్వర్యంలో సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో పోలీసుల పాత్రపై పోటీలు జరిగాయి. సహాయ కమాండెంట్లు మురళీకుమార్, సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెద్దాపురం: పోలీసు అమరవీరుల సంస్మరణ సందర్భంగా ఈ నెల 28న పెద్దాపురం పట్టణంలోని లెక్చరర్స్ కాలనీలో ఉన్న రోటరీ బ్లడ్ బ్యాంకులో పెద్దాపురం పోలీసు సబ్ డివిజన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎస్సై మౌనిక గురువారం తెలిపారు. శిబిరానికి అధిక సంఖ్యలో దాతలు తరలిరావాలని కోరారు.

భీమేశ్వరాలయంలో హుండీల ఆదాయం లెక్కింపు

సామర్లకోట గ్రామీణం: ప్రసిద్ధ పంచారామ పుణ్యక్షేత్రం శ్రీచాళుక్య కుమారరామ భీమేశ్వరాలయంలో గురువారం హుండీల ఆదాయం లెక్కింపు చేపట్టారు. రూ.16,00,139 దేశీయ నగదు, రూ.12,492 విలువచేసే ఇతర దేశాల కరెన్సీ వచ్చినట్లు తనిఖీదారు పణికుమార్ తెలిపారు.

దుంప రైతులకు స్ప్రేయర్ల పంపిణీ

పెద్దాపురం: పెద్దాపురం పట్టణంలోని ఉద్యాన పరిశోధన స్థానం(దుంప కేంద్రం)లో గురువారం గోకవరం మండలం మల్లవరం ఎస్సీ దుంప రైతులకు స్ప్రేయర్లు పంపిణీ చేశారు. శాస్త్రవేత్తలు సునీత, జానకి పాల్గొన్నారు.

26న సోమసుందర్ శతజయంతి సభ

గాంధీనగర్: కేంద్ర సాహిత్య అకాడమీ, క్రియా సొసైటీ కాకినాడ ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీవేత్త ఆవంత్స సోమసుందర్ శతజయంతి సభ శనివారం గాంధీ భవన్‌లో నిర్వహించనున్నట్లు క్రియా కార్యదర్శి జగన్నాథరావు తెలిపారు. పిఠాపురానికి చెందిన సోమసుందర్ చేసిన రచనలు ఎంతగానో పేరొందాయన్నారు.

కుళాయి.. ఇంటింటికి ఎన్నడోయి

పెదపూడి, న్యూస్‌టుడే: జల్ జీవన్ మిషన్(జేజేఎం) పథకం నిధులతో పెదపూడి, కరప మండలాల్లో చేపట్టిన ఇంటింటికీ కుళాయిల పనులు నెలల తరబడి నానుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం నిధులతో గత వైకాపా ప్రభుత్వంలో గ్రామాల్లో అరకొర పనులు చేశారు. కుళాయిలను ఏర్పాటు చేసి ట్యాంకులను నిర్మించకపోవడం. కొన్ని చోట్ల పైపు లైన్లను వేయకపోవడంతో నిరుపయోగంగా పనులు దర్శనమిస్తున్నాయి. మరోపక్క సుజల ధార నీటి పథకం సామర్థ్యాన్ని పెంచేందుకు జేజేఎం నిధులు కేటాయించినా నేటికీ పనులు ప్రారంభించలేదు. ఇకనైనా ప్రజలకు పుష్కలంగా తాగునీటిని అందించేలా పనులు వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బిల్లుల్లో జాప్యం..

పెదపూడి, కరప మండలాల్లో మొత్తం 87 పనులను గుర్తించి గ్రామాల్లో కుళాయిలు, పైపులైన్ల ఏర్పాటు, కొత్త ట్యాంకులు నిర్మించాల్సి ఉంది. ఈ పనులకు అప్పట్లో రూ.38.82కోట్లు కేటాయించి టెండర్లు పిలిచినా గత ప్రభుత్వంలో గుత్తేదారులకు నిధులు మంజూరు చేయకపోవడంతో కొత్త పనులకు నిరాకరించారు. ఎన్నికల ముందు కొంత మంది వైకాపా నాయకుల హామీతో మళ్లీ గుత్తేదారులకు పనులు అప్పగించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఉచిత కుళాయిలు ఎప్పుడు వస్తాయని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. పాత బకాయిలు రాకపోవడంతో ప్రస్తుతం గ్రామాల్లో శంకుస్థాపనలు చేసిన వాటికి పనులు ప్రారంభించకపోవడంతో అసలు కుళాయిలు వస్తాయా, రావా అని ఆందోళనలో ఉన్నారు.



గుర్రపుడెక్కతో మూసుకుపోయిన పెదపూడి చెరువు

నేటికీ ప్రారంభం కాని పనులు..

పెదపూడి మండలంలోని మొత్తం 13 పనులకు గాను రూ.16 కోట్లు నిధులు మంజూరు చేశారు. దీనిలో రూ.12.35 కోట్ల నిధులు పెదపూడి సీపీడబ్ల్యూ పథకంలో భాగంగా రెండు చెరువుల అభివృద్ధికి కేటాయించారు. వీటిని ఎన్నికల ముందు హడావుడిగా శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ ఆ పనులు ప్రారంభం కాలేదు. దీంతో పెదపూడి మండలంలో 14 గ్రామాలకు తాగు నీరందించడానికి తీవ్ర ఇబ్బంది ఎదుర్కోవాల్సి వస్తోంది. గ్రామాలకు రెండు రోజులకోసారి తాగునీరు అందించాల్సి ఉంది. కరప మండలంలో 52 పనులకు గాను రూ.22.82 కోట్లు మంజూరు చేశారు. ఆ పనులను ముందుకు సాగకపోవడంతో కుళాయిలు ఎప్పుడు వస్తాయోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు.



మొక్కల్లో నిరుపయోగంగా జేజేఎం పథకం పైపులు

త్వరలో పనులు ప్రారంభిస్తాం..

గత వైకాపా హయాంలో చేసిన పనులకు గుత్తేదారులకు నిధులు మంజూరుకాక వారు ముందుకు రావడంలేదు. దీంతో పనులు ఆలస్యమయ్యాయి. ప్రస్తుతం పెదపూడిలో చెరువుల అభివృద్ధి పైపులైన్ల పనులు చేపట్టడానికి సన్నాహాలు చేస్తున్నాం. త్వరలో ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీరు అందించడానికి చర్యలు తీసుకుంటున్నాం. **- గంగాధర్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, పెదపూడి**

సమగ్రంగా పశు గణన

కరప: పశుగణన సమగ్రంగా నిర్వహించేలా క్షేత్ర స్థాయి సిబ్బంది కృషి చేయాలని ఏడీ సురేష్‌బాబు సూచించారు. కరపలోని పశుసంవర్ధక శాఖ ఏరియా ఆసుపత్రిలో పశుగణనపై వీహెచ్ఏలు ఇతర సిబ్బందికి యాప్‌లో అంశాల నమోదుపై అవగాహన కల్పించారు. రవికిరణ్, అనిల్ పాల్గొన్నారు.

ఉద్యమంలా పార్టీ సభ్యత్వాల నమోదు

తాళ్లరేవు: ప్రతి కార్యకర్త ఉద్యమంలా తెదేపా సభ్యత్వాల నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని తెదేపా క్లస్టర్ సమన్వయకర్త లక్ష్మణరావు పిలుపునిచ్చారు. త్రిమూర్తులు అధ్యక్షతన సమావేశం గురువారం నిర్వహించారు. ఈశ్వరరావు, వెంకటేశ్వరరావు, భైరవమూర్తి, రామలక్ష్మి, సత్తిబాబు మాట్లాడారు.

విద్యాసామగ్రి పంపిణీ

తాళ్లరేవు: పి.మల్లవరానికి చెందిన కొమ్మిరెడ్డి రాజేష్‌గాంధీ, ధూళిపూడి సురేష్ పుట్టినరోజు వేడుకల సందర్భంగా స్థానిక మండల ప్రాథమిక పాఠశాలలో 140 మంది విద్యార్థులు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ధూళిపూడి వెంకటరమణ(బాబి), లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పేరయ్యరాజు, రీజియన్ ఛైర్మన్ బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి, చోడే శ్రీనివాసరావు, నాగార్జున, నాగమణి పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

సామర్లకోట గ్రామీణం: బాణసంచా విక్రయదారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దారు చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన విక్రయదారులతో సమావేశం నిర్వహించారు. సామర్లకోట సీఐ కృష్ణభగవాన్, అసిస్టెంట్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అక్నూ కాకినాడ పీజీ క్యాంపస్ ప్రిన్సిపల్‌గా కమలకుమారి



బాధ్యతలు స్వీకరిస్తున్న కమలకుమారి

సర్పవరం జంక్షన్: తిమ్మాపురంలోని ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయం కాకినాడ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా ప్రొఫెసర్ కమలకుమారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీరామరాజు ఆధ్వర్యంలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. 49 మంది ఉద్యోగాలు సాధించారు. డా.జోసఫ్ స్టీఫెన్ ఆధ్వర్యంలో ఐక్యరాజ్యసమితి వ్యవస్థాపక దినోత్సవం జరిగింది.

మేమున్నాం.. మీకు తోడుగా

సమస్య: ఎ.విజయనగరంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం పరిసరాల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి పాములు సంచరిస్తున్నాయి. **- జి.శ్రీనివాసు, ఎ.విజయనగరం**

పరిష్కారం: సమస్యను ఈవోపీఆర్డీ కుమార్‌కు తెలుపగా పిచ్చిమొక్కలు తొలగించే పనులు చేపట్టారు. కలుపు మొక్కల నివారణకు రసాయనం పిచికారీ చేయించారు.

రహదారులు అధ్వాన్నంతో ఇబ్బందులు

సమస్య: వాకలపూడిలో రహదారులు అధ్వానంగా ఉండడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **- సరసింహారావు, స్థానికులు**

పరిష్కారం: సమస్యను పంచాయతీ కార్యదర్శి పిడుగు పాండురంగారావుకు వివరించగా.. పల్లె పండగ, పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా రూ.80 లక్షలతో అయిదు రహదారులు నిర్మాణ పనులు ప్రారంభించారు.

– న్యూస్‌టుడే, గొల్లప్రోలు, సర్పవరం జంక్షన్

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
కాకినాడ గ్రామీణం: 80085 74325
పెద్దాపురం: 80085 74198
పిఠాపురం: 80085 65544

గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఉండొద్దు

రమణయ్యపేట(సర్పవరం జంక్షన్): కాకినాడ గ్రామీణ మండలంలోని గ్రామాల్లో పర్యటనకు వెళ్లినప్పుడు ప్రజలు తాగునీటి సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదు చేస్తున్నారని, అధికారులు వెంటనే ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణం పూర్తి చేసి స్వచ్ఛమైన తాగునీరందించేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే నానాజీ సూచించారు. సర్పవరం జంక్షన్‌లోని కాకినాడ గ్రామీణ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ బందిలి విరీష అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే నానాజీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎంపీడీవో సతీష్, తహసీల్దారు కుమారి, ఈవోపీఆర్డీ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నానాజీ

సురక్షిత ప్రయాణమే లక్ష్యం



కోరింగలో బస్సులను ప్రారంభిస్తున్న ఎంపీ హరీష్

తాళ్లరేవు, న్యూస్‌టుడే: సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా బస్సులు నడపాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథుర్ అన్నారు. తాళ్లరేవు మండలం కోరంగిలో కాకినాడ- తుని మధ్య నాలుగు అల్ట్రా పల్లె వెలుగు బస్సులను ఎంపీ గంటి హరీష్ మాథుర్ గురువారం ప్రారంభించారు. టేకుమూడి లక్ష్మణరావు, ఉల్లింగి జాన్, జక్కల ప్రసాదబాబు, ధూళిపూడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలపై విచారణ

తాళ్లరేవు: క్షేత్ర సహాయకురాలు జ్యోతిపై ఆరోపణల నేపథ్యంలో గురువారం చొల్లంగిపేట పంచాయతీ కార్యాలయం వద్ద ఏపీడీ వసంత మాధవి గురువారం విచారణ చేపట్టారు. ఏపీవో తేజస్విని, కందిళ్ల గంగబాబు, మందాల సత్తిబాబు, మైదు హరిబాబు, యండమూరి సత్తిబాబు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

గొల్లపాలెంలో అన్నదానం

కాజులూరు: గొల్లపాలెంలో సాయిబాబా అలయం వద్ద గురువారం అన్నదానం నిర్వహించారు. సాయి నవరాత్రుల కార్యక్రమంలో గొల్లపాలెం, ఆర్యవటం, శలపాక, తణుకువాడ, కొంగోడు, తదితర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

సవరణలకు అవకాశం



పండూరులో అవగాహన కల్పిస్తున్న కుమారి

సర్పవరం జంక్షన్, గొల్లప్రోలు, పెదపూడి, తాళ్లరేవు: భూముల రీసర్వేలో తప్పొప్పుల సవరణ కోసం గ్రామాల్లో అవగాహన సభలు నిర్వహిస్తున్నామని, అవసరమైన వారు దరఖాస్తు చేసుకుంటే డిసెంబరు నెలాఖరులోపు సరిచేస్తామని గ్రామీణ తహసీల్దారు ఎస్ఎల్ఎన్ కుమారి తెలిపారు. పండూరు గ్రామంలో గురువారం గ్రామసభ నిర్వహించి అవగాహన కల్పించారు. ● పంట భూముల రీసర్వే తప్పిదాలను సరిచేయాలని కోరుతూ గురువారం ఎ.కె.మల్లవరం, ఎ.పి.మల్లవరం గ్రామాల్లో నిర్వహించిన సభలలో అధికారులకు రైతులు 149 అర్జీలు అందజేశారు. డిప్యూటీ తహసీల్దారు ఎస్.కె.మస్తాని, మండల సర్వేయరు కేదారేశ్వరరావు, వీఆర్వోలు, గ్రామసర్వేయర్లు పాల్గొన్నారు. ● తహసీల్దారు సీతాపతిరావు గురువారం అచ్యుతాపురత్రయం సభలో పాల్గొన్నారు. ఆరుమిల్లి సత్యభారతి ప్రసాద్, వీఆర్వో అంజిబాబు పాల్గొన్నారు. ● చొల్లంగిపేట పంచాయతీ కార్యాలయం వద్ద రీసర్వే భూములకు సంబంధించిన సమస్యలపై గురువారం గ్రామసభ నిర్వహించారు. ఉపతహసీల్దారు సూరిబాబు రైతుల నుంచి 13 దరఖాస్తులు స్వీకరించారు. ఆర్ఐ రామకృష్ణ, ఏఎస్‌వో రమణ, కందిళ్ల గంగబాబు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడి



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలను ట్రాక్టర్ నుంచి కిందకు దింపుతున్న పోలీసులు

కాజులూరు, న్యూస్‌టుడే: కాజులూరు మండలం శీల గ్రామంలో పోలీసులు కోడి పందేల స్థావరాలపై దాడిచేసి 28 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. గొల్లపాలెం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... శీల శివారు శుంకం ఏరియాలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం సమాచారం అందడంతో దాడి చేశారు. ఈ దాడిలో 28 ద్విచక్ర వాహనాలు, రూ.4,500 నగదు, నాలుగు కోళ్లు, కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాలను ట్రాక్టర్లపై తీసుకొచ్చి స్టేషన్ ఆవరణలో ఉంచారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.మోహన్‌కుమార్ తెలిపారు.

రోజంతా సీహెచ్‌సీలో మృతదేహం

తాళ్లరేవు: నీలపల్లి సమీపంలో ఓ వృద్ధుడు స్పృహ తప్పి పడిపోవడంతో స్థానికులు 108 వాహనంలో తాళ్లరేవు సీహెచ్‌సీకి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. అతడి కోసం ఎవరూ రాకపోవడంతో మృతదేహం ఆసుపత్రిలోనే ఉండిపోయింది. అతని జేబులో కోరింగ నుంచి యానాం బస్ టికెట్ ఉంది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తపల్లి: కడుపునొప్పి తాళలేక మనస్తాపంతో యు.కొత్తపల్లి మండలం నాగులాపల్లికి చెందిన గందులూరి గందాలరెడ్డి(48) విష రసాయనం తాగి చికిత్సపొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ నెల 17న అతన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. మృతిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

జూదరుల అరెస్టు

కరప: పేకాట శిబిరంపై ఆకస్మిక దాడులు నిర్వహించి ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సునీత తెలిపారు. నడకుదురు శివారు పంట పొలాల్లో ముగ్గురి నుంచి రూ.30,390 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

బాలికకు అస్వస్థత..

మసీదు సెంటర్(కాకినాడ): పెద్దాపురం మండలం కాండ్రకోటకి చెందిన నాలుగేళ్ల బాలిక ఇంటి వద్ద ఆడుకుంటూ ప్రమాదవశాత్తు టర్పంటాయిల్ తాగింది. అస్వస్థతకు గురవ్వడంతో ప్రథమచికిత్స అనంతరం గురువారం జీజీహెచ్‌లో చేర్చారు.

ఆటోలు ఢీ.. ఒకరికి గాయాలు

పెద్దాపురం: పెద్దాపురం నుంచి రాజమహేంద్రవరం వెళ్లే ఏడీబీ రహదారిలో దుర్గమ్మగుడి వద్ద గురువారం ఎదురెదురుగా రెండు ఆటోలు ఢీకొన్నాయి. ఘటనలో స్వామి అనే వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు అతన్ని పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు.


అసౌకర్యం.. అంధకారం

జాతీయ రహదారిపై ప్రయాణం అంటేనే వాహన చోదకులు హడలిపోతున్నారు. ఎక్కడికక్కడే స్టాపర్ బోర్డులు రోడ్డుపై అడ్డంగా పడి ఉండడంతో అదుపు తప్పి ప్రమాదాల బారి నపడుతున్నారు. మరోపక్క రాత్రుళ్లు ప్రధాన కూడళ్లలో విద్యుత్తు దీపాలు వెలగకపోవడంతో మార్గమంతా చీకటిమయంగా ఉంటోంది. దాంతో ప్రయాణాలు సాఫీగా సాగడం లేదు. – న్యూస్‌టుడే, పిఠాపురం

పిఠాపురం మీదుగా వెళ్లే 216 జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని చిత్రాడ నుంచి పట్టణంలోని పాదగయ, భీమనగర్, రాపర్తి కూడలి మీదుగా గొల్లప్రోలు, చేబ్రోలు నుంచి కత్తిపూడి వరకు 20 కిలోమీటర్ల దూరం ఉంటుంది. కాకినాడ నుంచి విశాఖ, సామర్లకోట రైల్వేజంక్షన్‌కు వెళ్లేందుకు, అక్కడున్న పరిశ్రమల్లో పనిచేసే వారు వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం. మరోపక్క ఉప్పాడ, కాకినాడ బీచ్‌లకు కూడా ఇలానే వెళ్లాలి. ఇలాంటి మార్గంలో రహదారి భద్రతాప్రమాణాలను గాలికొదిలేస్తున్నారు. ప్రధాన కూడళ్ల వద్ద నిత్యం వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతాల్లో పోలీసులు గతంలో స్టాపర్ బోర్డులు ఏర్పాటు చేశారు. అవన్నీ ప్రస్తుతం పాడైపోయి రోడ్లపై అడ్డుగా పడిఉన్నాయి. దాంతో వాహనచోదకులు గుర్తించలేక వాటిని ఢీకొని గాయాలపాలవుతున్నారు. ఇదే మార్గంలో ప్రధాన కూడళ్లతోపాటు టోల్ ప్లాజా వద్ద, చిత్రాడ రైల్వేగేటుపై ఏర్పాటు చేసిన రెండు పైవంతెనలపై విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. ప్రధాన కూడళ్లలో చిమ్మచీకట్లు నెలకొనడంతో రాత్రివేళల్లో రోడ్డు దాటుతున్న బాటసారులను వాహనాలు ఢీకొంటున్నాయి. ఇలా పాదగయ, విరవాడ, చిత్రాడ, గొల్లప్రోలు కూడళ్ల వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.



విరవాడ రోడ్డులో స్టాపర్ బోర్డుల దుస్థితి



చిత్రాడ వంతెనపై వెలగని విద్యుత్తు దీపాలు

నిర్వహణ గాలికొదిలేశారు..

జాతీయ రహదారి నిర్వహణ పనులను గుత్తేదారు పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా కూడళ్ల వద్ద విద్యుత్తు దీపాల ఏర్పాటు, వాటి మరమ్మతులపై నిర్లక్ష్యం నెలకొంది. మరోపక్క టోల్ ప్లాజా వద్ద నిత్యం విద్యుత్తు దీపాలు వెలుగుతూఉండాలి. అవి కూడా మరమ్మతులకు గురయ్యాయి. అప్పడప్పుడూ పోలీసులే బాగు చేయిస్తున్నారు. జాతీయ రహదారి నిర్వహణ అధికారుల్లో మాత్రం స్పందన కనిపించడం లేదు. రోడ్ల పక్కన వాహనాలు నిలిపేయడం, డివైడర్ మధ్యలో గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగిపోతున్నా సరిగా శుభ్రం చేయకపోవడం వంటి ఇబ్బందులున్నాయి. రహదారి, టోల్ ప్లాజ్ రుసుములు వసూలు చేస్తున్నా.. ఆ మేరకు సౌకర్యాలు కల్పించకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం..

విద్యుత్తు దీపాలు వెలగడం లేదని జాతీయ రహదారి నిర్వహణ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లాం. గతంలో మరమ్మతులు చేశారు. మళ్లీ వెలగడం లేదు. మరోసారి వారిని సంప్రదిస్తాం. స్టాపర్ బోర్డులు బాగు చేయాల్సిన బాధ్యత మాదే. తక్షణం పాడైనవి తొలగించి, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చేస్తాం. **- జి.శ్రీనివాస్, సీఐ, పిఠాపురం**

నీటి వృథాకు అడ్డుకట్ట

ఈనాడు కథనానికి స్పందన



పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పిఠాపురం: పిఠాపురం జగ్గయ్యచెరువులోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద మంచినీటి వృథాకు అధికారులు అడ్డకట్ట వేశారు. కొంతకాలంగా నీరు వృథా కావడం, కలుషితం అవుతుండడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యపై బుధవారం 'ఈనాడు'లో 'రోడ్డున జలం.. కలుషితమయ్యే ప్రమాదం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించారు. పైపులైన్ లీకేజీని గుర్తించి మరమ్మతులు చేయించామని మంచినీటి పర్యవేక్షణ అధికారి జనార్దన్ తెలిపారు.

మురికి కూపం.. దయనీయం



పిఠాపురంలో ఆదిత్య పాఠశాల సమీపం, రాజుగారికోటను ఆనుకుని ఉన్న ప్రాంతం కొన్నేళ్లుగా మురుగుమయంగా మారింది. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగంతా రోడ్డుపై చేరుతోంది. మరోపక్క కచ్చా డ్రెయినేజీలో నీరు నిలిచి దుర్గంధంగా మారింది. దాంతో ఆ మార్గంలో ప్రయాణించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీని గురించి పారిశుద్ధ్య కార్యదర్శి రాంబాబును అడుగగా ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఇటీవల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేశారన్నారు. – న్యూస్‌టుడే, పిఠాపురం

బాణసంచా విక్రయదారులు నిబంధనలు పాటించాల్సిందే..

పిఠాపురం: బాణసంచా దుకాణాల వద్ద నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తహసీల్దారు గోపాలకృష్ణ తెలిపారు. పిఠాపురం తహసీల్దారు కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. నిబంధనలు వివరించారు. ఆర్ఐ వెంకటేష్ పాల్గొన్నారు.

సాంకేతిక విద్యా ఉత్సవాల ప్రారంభం



కళాశాలలో సాంకేతిక విద్యా ఉత్సవాల్లో విద్యార్థులు

గొల్లప్రోలు: చేబ్రోలులోని ఆదర్శ్ ఇంజినీరింగ్ కళాశాలలో సాంకేతిక విద్యా ఉత్సవాలను గురువారం ఛైర్మన్ బుర్రా అనుబాబు ప్రారంభించారు. మొదటి రోజు పేపర్, పోస్టర్ ప్రజెంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో అంశాలపై విద్యార్థులకు బృందాలుగా పోటీలు నిర్వహించామని ప్రిన్సిపాళ్లు శ్రీనివాసరావు, రాజశేఖర్ తెలిపారు. 24 గంటల హ్యాక్‌థాన్ నిర్వహిస్తామన్నారు. స్మార్ట్ బ్రిడ్జి ప్రతినిధులు శిక్షణ ఇస్తారని, మూడు రోజులపాటు ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. కరస్పాండెంట్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

గొల్లప్రోలు: దోమ కాటు, పొగాకు కారణంగా ఆశించే రోగాలు, పౌష్టికాహార లోపం గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. తాటిపర్తి, చినజగ్గంపేట గ్రామాల్లో గొల్లప్రోలు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సునీత మెర్సీ, వైద్యారోగ్యశాఖ పర్యవేక్షకుడు శ్రీనివాసరావు, అహ్మద్‌బాషా పర్యటించారు. సదస్సులు నిర్వహించి ఆసుపత్రి ప్రసవాలు, రక్తహీనత నివారణ చర్యలను వివరించారు. చినజగ్గంపేట ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. మధ్యాహ్న భోజనం, ఆర్వోప్లాంటు పనితీరు పరిశీలించారు.



తాటిపర్తిలో దోమలతో ప్రబలే వ్యాధులను వివరిస్తున్న డాక్టర్ సునీత

గురుకుల పాఠశాలలో నమూనా ఎన్నికలు



చొల్లంగిపేట గురుకులంలో పాల్గొన్న విద్యార్థులు

తాళ్లరేవు, న్యూస్‌టుడే: యాక్టిజన్ క్లబ్ ఆధ్వర్యంలో చొల్లంగిపేట డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులకు ఎన్నికలు, నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపల్ శ్రావణి, హైమావతి, పార్వతి, రమణి, రోహిణి, ఉష తదితరులు పాల్గొన్నారు.

'ఇల్లు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి'

పెదపూడి: అన్యాయంగా ఇంటిని కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని న్యూడెమోక్రసీ పార్టీ నాయకుడు గుబ్బల ఆదినారాయణ అన్నారు. దోమాడ చెరువు ఎదురుగా ర.భ.రోడ్డు పక్కన కూల్చిన వృద్ధురాలి ఇంటి వద్ద నిరసన తెలిపి శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామన్నారు.

స్త్రీ నిధి నుంచి గృహ రుణాలు

పెదపూడి: ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు స్త్రీనిధి నుంచి గృహ రుణాలు ఏర్పాటు చేస్తామని ఈవోపీఆర్డీ సత్యనారాయణరెడ్డి తెలిపారు. గురువారం జి.మామిడాడ పంచాయతీ కార్యాలయంలో జగనన్న కాలనీ1లో నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారుల సమావేశం నిర్వహించారు. ఏఈ శ్రీనివాస్, ఉపాధి హామీ ఏపీవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మలుపు అపాయం



సామర్లకోట నుంచి పెద్దాపురం పట్టణానికి వచ్చే ప్రధాన రహదారిలో పాండురంగస్వామి గుడి చెంతన మలుపులో రహదారి కోతకు గురైంది. వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా.. రోడ్డు పక్కనున్న కాలువలో పడిపోవాల్సిందే. రాత్రి వేళల్లో ఆ సమస్య మరింత యాతనగా మారుతోందని స్థానికులు వాపోతున్నారు. ప్రధాన రహదారి మార్గం కావడంతో నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ప్రమాదాలు జరక్కుండా ర.భ.శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీని గురించి డీఈ రాఘవరావును అడుగగా నిధులు రాగానే పనులు చేపడతామన్నారు.

– న్యూస్‌టుడే, పెద్దాపురం

దారి అధ్వానం



పిఠాపురం నుంచి సామర్లకోటకు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. అయిదేళ్లుగా నిర్మాణం చేపడతామని అధికారులు చెబుతున్నా. పనులు చేపట్టలేదు. ఈ దారిలో విద్యార్థులు, కార్మికులు, పర్యాటకులతోపాటు రాకపోకలు సాగించే ఇతర ప్రయాణికులూ నిత్యం యాతన పడుతున్నారు. వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతుండడంతో వ్యయప్రయాసలు తప్పడం లేదని పలువురు వాపోతున్నారు. ఇటీవల వర్షాలకు గుంతలు పెద్దవయ్యాయి. రెండు పురపాలికలను కలిపే రహదారి దుస్థితిపై ర.భ. శాఖ ఏఈ లోవరాజును అడుగగా ఇటీవలే గుంతలు తాత్కాలికంగా పూడ్చామని, రోడ్డు పనులు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, పిఠాపురం

తుని

• తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

నేటి నుంచి రోటరీ యువజనోత్సవాలు

తుని: 'రంగం' 2024 పేరిట రోటరీ యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు చల్లా మంగరాజు తెలిపారు. ఈనెల 25 నుంచి నవంబరు 29 వరకు వివిధ పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆయా పాఠశాలలు, కళాశాలల నుంచి హాజరై తమ ప్రతిభ చాటుకోవచ్చన్నారు. పాటలు, నృత్యం, చిత్రలేఖనం, క్విజ్, చెస్ పోటీలతోపాటు వాలీబాల్, త్రోబాల్, ఖోఖో, క్రికెట్ వంటి క్రీడా పోటీలూ ఉంటాయన్నారు.

దేవస్థానం ఉద్యోగుల అంతర్గత బదిలీలు

అన్నవరం: అన్నవరం దేవస్థానంలో పలువురు ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేస్తూ ఈవో కె. రామచంద్రమోహన్ ఆదేశాలిచ్చారు. బదిలీపై వచ్చిన పలువురు జూనియర్ అసిస్టెంట్లకు విభాగాలు కేటాయించారు. పలువురు రికార్డు అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లకు విభాగాలు మార్చారు.

నవంబరు 4న కోటి బిల్వార్చన

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు ఎస్‌హెచ్ ఆనుకొని మినర్వా కళాశాల ఎదురుగా నవంబరు 4న నిర్వహించనున్న దృష్ట్యా అయ్యప్ప కోటి బిల్వార్చన నిర్వహించే మైదానంలో అమ్మవారికి గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. సత్తెమ్మ తల్లికి మాలధారులంతా శాస్త్రోక్తంగా పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం భూమి పూజ చేశారు. కోటి బిల్వార్చన, లక్ష దీపోత్సవం విజయవంతం కావాలని మొక్కుకున్నారు. పూజా కార్యక్రమాల నిర్వహణకు కమిటీలుగా ఏర్పడి ఏర్పాట్లు చేస్తున్నారు.


అమ్మవారి పూజల్లో అయ్యప్ప మాలధారులు

ప్రతిభ చాటి.. విజేతలుగా నిలిచి..

తుని, న్యూస్‌టుడే: ప్రతిభాపాటవ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు జరిగాయి. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశాలపై తమ ఆలోచనలు స్పష్టంగా వెల్లడించారు. పాఠశాల ఉపాధ్యాయులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి విజేతలను ఎంపిక చేశారు. పోటీల్లో పత్రి హర్షిణి (9వ తరగతి), దాడి భానుక్రాంతి (8వ తరగతి), పసుపులేటి భవానీ (10వ తరగతి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి హెచ్‌ఎం ఎం.సూర్యరత్నం, ఉపాధ్యాయులు డివి ఎల్ఎన్ ప్రసాద్, ఎస్.వెంకటగిరి చేతుల మీదుగా ధ్రువపత్రాలు, బహుమతులు అందజేశారు.


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న జిల్లా పరిషత్ విద్యార్థులు


విజేతలకు బహుమతులు అందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

వ్యర్థాల తొలగింపు.. దారి శుభ్రం

ఈనాడు స్పందన

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు ఇందిరాకాలనీ నుంచి కిర్లంపూడి మండలం వేలంక వెళ్లే దారి ఇది. రెండు మండలాల మధ్య రాకపోకలు సాగే ఈ రహదారి వెంబడి అటూ ఇటూ పెరిగిన దట్టమైన తుప్పలను తొలగించారు. 'ఆ దారిలో అన్నీ సమస్యే' శీర్షికన 21న ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో కుమార్‌బాబు స్పందించారు. ఉపాధి కూలీలను నియమించి దారి వెంబడి ఉన్న తుప్పలను తొలగించారు. కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.


ప్రత్తిపాడు ఇందిరాకాలనీ- వేలంక దారి బాగుచేశారిలా..

పట్టభద్రులు ఓటు నమోదుకు అవకాశం

గండేపల్లి(జగ్గంపేట)న్యూస్‌టుడే: డిగ్రీ పూర్తి చేసి మూడేళ్లు గడిచిన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదుకు అవకాశముందని తెదేపా జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ అన్నారు. గురువారం జగ్గంపేట తెదేపా కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ.. ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థిని పేరాబత్తుల రాజశేఖర్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. దీనిపై 20 మంది సభ్యులను ఎన్‌రోల్ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాయకులు అప్పలరాజు, భద్రం,జీను మణిబాబు, కొత్త కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎకరాల్లో భూములు.. స్వామికేవీ సేవలు

కిర్లంపూడి, న్యూస్‌టుడే: గోనేడ రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాల స్వామికి దశాబ్దాల కిందట దాతలు ఇచ్చిన 11.80 ఎకరాల భూమి ఉంది. 20 ఏళ్ల కిందట అర్చకుడిని ఆలయ ట్రస్టీగా దేవాదాయశాఖ నియమించడంతో అప్పటి పూజారి స్వామివారి భూములను అయిన కాడికి డబ్బులు దండుకుని 12 మందికి ధారాదత్తం చేశారు. అప్పటివరకు రోజూ ధూపదీప నైవేద్యాలతో వెలుగొందే ఈ ఆలయంలో 20 ఏళ్లుగా దీపం పెట్టే దిక్కు లేదు. సుమారు రూ.అయిదు కోట్ల విలువైన ఈ భూములు గోనేడ నుంచి జగ్గంపేట వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్నాయి. ఈ విషయంలో దేవాదాయశాఖ అధికారులు మౌనముద్ర దాల్చడం గమనార్హం.

భూముల వివరాలివీ..

గోనేడ స్వామి ఆలయానికి వివిధ సర్వే నంబర్ల కింద 11.80 ఎకరాల భూమి ఉంది. 2001 వరకు ఈ ఆలయానికి ఈవోలు ఇన్‌ఛార్జులుగా వ్యవహరిస్తూ వచ్చారు. అప్పటివరకు భూములు ఆలయ ఆధీనంలో ఉండేవి. భూముల ద్వారా ఆలయానికి ఆదాయం సమకూరేది.

2001 జీవోతో అన్యాక్రాంతం

దేవాదాయశాఖ 2001లో ఆలయ అర్చకులనే సింగిల్‌మెన్ ట్రస్టీగా నియమిస్తూ జీవోను విడుదల చేసింది. దీన్ని అడ్డు పెట్టుకుని అప్పటి ఆలయ అర్చకుడు స్వామి వారి ఆలయానికి చెందిన భూములను ఎకరా రూ.20 వేల నుంచి రూ.30 వేలకు 11.80 ఎకరాల భూమిని 12 మంది రైతులకు ధారాదత్తం చేశారు. ఇటీవల రీ సర్వే జరిగే వరకు ఈ భూములు రైతుల పేరున ఆన్‌లైన్లో ఉండేవంటే ఇక్కడి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. 20 ఏళ్లుగా గ్రామానికి చెందిన పలువురు ఈ భూములు ఆలయానికి చెందాలని కోరుతూ దేవాదాయశాఖ అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదు. ప్రస్తుత రీసర్వే తరువాత ఈ భూములు ఆలయ భూములుగా పరిగణిస్తూ నిషేధిత జాబితాలో పెట్టారే తప్ప దేవస్థానానికి అప్పగించలేదు. రీ-సర్వే అయిన తరువాత కూడా ఆ భూములు గతంలో ఎవరైతే అన్యాక్రాంతం చేసుకున్నారో వారికే రెవెన్యూ సిబ్బంది దేవాదాయశాఖ అనుమతులు లేకుండా కౌలు కార్డులు జారీచేశారు. దీంతో ఆ భూముల్లో వారు సాగు చేసుకుంటున్నట్లు అయ్యింది. కానీ దేవస్థానానికి దమ్మిడీ ఆదాయం రావడంలేదు. విలువైన భూములు ఉన్న స్వామికి ఆదాయంలేక ధూపదీప నైవేద్యాలు పెట్టేందుకు అర్చకులు ఆలయం వైపు రావడం లేదు. కొద్దికాలం గ్రామస్థులు చందాలు వేసుకుని అర్చకుడ్ని పోషించి ఆనక వదిలేశారు. ప్రభుత్వం ఆలయాలకు ఇచ్చే ధూపదీప నైవేద్యాల ఖర్చుల కోసం మంజూరుచేసే రూ.10వేలు ఈ ఆలయానికి వర్తించడం లేదు. భూములు ఉన్న ఆలయంగా గుర్తించడంతో వేణుగోపాలస్వామి ఆలయానికి ఆదరణ కరవైంది.


గోనేడలో స్వామి వారి ఆలయం పరిస్థితి ఇది.


స్వామికి చెందిన ముక్కారు పంటలు పండే భూములు

ఉన్నతాధికారులకు నివేదించాం..

గోనేడలో వేణుగోపాలస్వామి వారి ఆలయానికి 11.80 ఎకరాల భూములు ఉన్నాయనేది వాస్తవం. ఇవి 2001 తరువాత ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయి. ఇటీవల రీ సర్వేలో ఈ విషయం బయటపడింది. ఈ భూములను నిషేధిత జాబితాలో పొందుపరిచాం. దీనిపై దేవాదాయ శాఖ డీఈవోకి సమగ్ర నివేదిక సమర్పించాం. వారే ఈ విషయమై చర్యలు తీసుకోవాల్సిఉంది.

- జోగా సత్యనారాయణ, ఇన్‌ఛార్జి గ్రూప్ ఈవో, కిర్లంపూడి.

దీక్షాదారులకు వస్త్రాలు అందజేత

గండేపల్లి(జగ్గంపేట), న్యూస్‌టుడే: భక్తులకు ఉచితంగా సత్యనారాయణస్వామి దీక్ష వస్త్రాలు అందజేసినట్లు సత్యదీక్ష ప్రచారకర్త కృష్ణబాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 27 నుంచి 27 రోజులుపాటు ఈ దీక్ష కొనసాగుతుందని అన్నారు. జగ్గంపేట, మల్లిశాల, ఇర్రిపాక, కాట్రావులపల్లి గ్రామాలకు చెందిన భక్తులకు దీక్ష వస్త్రాలు అందజేశారు.

పేదల కడుపులు నింపుతూ..

తుని పట్టణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మళ్లీ ప్రారంభించిన అన్నాక్యాంటీన్లతో పేదల కడుపులు నిండుతున్నాయని అనకాపల్లి జిల్లా పాయకరావుపేట జనసేన నాయకులు తోట నగేష్ అన్నారు. తన వంతుగా 100 మంది పేదలకు టోకెన్లు కొనుగోలు చేసి ఇచ్చారు. పుట్టినరోజు, ఇతర శుభకార్యాల సందర్భంలోను అన్నాక్యాంటీన్ ద్వారా పేదలకు భోజన పదార్థాలు ఇవ్వడానికి ముందుకు రావాలన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే : రాజపూడి సబ్‌స్టేషన్ పరిధిలో మల్లిసాల, రాజపూడి, జె.కొత్తూరు, సీతారాంపురం, బలభద్రపురం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ వీరభద్రరావు తెలిపారు. 11కెవి ఫీడర్ మరమ్మతులు, చెట్లునరికివేత కారణంగా సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు.

చెరువుల మరమ్మతులకు నిధులు

తుని గ్రామీణం: తొండంగి మండల పరిధిలోని సాగునీటి సమస్యల పరిష్కారానికి రూ.8 లక్షల నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే దివ్య తెలిపారు. తేటగుంట పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో ప్రజా సమస్యలపై ఆమె చర్చించారు. ఆమె మాట్లాడుతూ.. చెరువుల మరమ్మతుల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించినట్లు తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభించాలని సూచించారు. నాయకులు, సుర్ల లోవరాజు, యినుగంటి సత్యనారాయణ, మళ్ల గణేష్, లంక సునీన్, కుక్కడపు బాలాజీ పాల్గొన్నారు.


నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే దివ్య

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

తుని, ఏలేశ్వరం, న్యూస్‌టుడే: పొదుపు సంఘాల మహిళలు అన్నివిధాలా ఆర్థికంగా ఎదగడానికి కృషిచేయాలని పురపాలక కమిషనర్ ఎ.వెంకట్రావు సూచించారు. కార్యాలయం ఎదుట మెప్మా ఆధ్వర్యంలో మహిళలు ప్రత్యేకంగా అర్బన్ మార్కెట్ స్టాల్స్ ఏర్పాటు చేశారు. మెప్మా సీఎంఎం శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. ● ఏలేశ్వరం ప్రధాన రహదారి చెంతనే గురువారం మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్‌ని నిర్వహించారు. ఆభరణాలు, వస్త్రాలు, బొమ్మలు, తినుబండారాలు తదితర దుకాణాలను మహిళలు ఏర్పాటుచేశారు. మెప్మా సమన్వయకర్త సాయికుమార్ మాట్లాడుతూ.. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను మహిళలు సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికే వార్డుల్లోకి..

ఏలేశ్వరం: పలు వార్డుల్లో గురువారం కమిషనర్ ఎం.సత్యనారాయణ పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న డ్రైనేజీలను పరిశీలించి, స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకుంటున్నారు. నాయకులు ఎండగొండి నాగబాబు, మామిడి లలిత తదితరులు ఉన్నారు.


ప్రదర్శన పరిశీలిస్తున్న పురపాలక కమిషనర్


సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతుల నవీన్‌కుమార్

నేటి నుంచి ఉచిత డీఎస్సీ శిక్షణ

గండేపల్లి (జగ్గంపేట) న్యూస్‌టుడే: జగ్గంపేట కాపు కల్యాణమండపంలో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేటి నుంచి 600మంది అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత కోచింగ్ ప్రారంభం కానుందని తెదేపా జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ అన్నారు. గురువారం జగ్గంపేట తెదేపా కార్యాలయం వద్ద నవీన్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ.. సుమారు 60 రోజులకు పైగా అనుభవజ్ఞులైన అధ్యాపక సిబ్బందిచే టెట్ కోచింగ్ ఇచ్చామన్నారు. ఇందులో అర్హత సాధించిన ప్రతి అభ్యర్థి ఈ డీఎస్సీ కోచింగ్‌కు రావచ్చన్నారు.

ఉపాధికి వెళ్తే ఊపిరి పోయింది

● రోడ్డు ప్రమాదంలో వాహనచోదకుడు..



తుని గ్రామీణం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా తుని మండలం చేపూరు వద్ద జరిగిన రహదారి ప్రమాదంలో విజయనగరం జిల్లా గుర్లకి చెందిన **కల్యాణపు గురునాయుడు**(35) మృతి చెందినట్లు రూరల్ ఎస్సై కృష్ణామాచారి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. గురునాయుడు లారీ డ్రైవరుగా పనిచేసేవాడు. కుటుంబపోషణ కోసం ఆఫ్టింగ్ డ్రైవరుగా వెళ్లాడు. గురువారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి విజయనగరం కోడిగుడ్ల లోడుతో వెళ్తున్న వ్యాను చేపూరు ఎన్‌హెచ్ కూడలి వద్ద మలుపు తిరుగుతున్న లారీని ఢీకొనడంతో వ్యాను క్యాబిన్‌లో డ్రైవర్ చిక్కుకున్నాడన్నారు. దీంతో సమాచారం తెలుసుకున్న హైవే ఆథారిటీ అంబులెన్సు సిబ్బంది కొనఊపిరితో ఉన్న డ్రైవర్‌ను బయటకు తీసే ప్రయత్నం చేసి ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారన్నారు. క్లీనరు రౌతు రాము గాయపడ్డాడు. గురునాయుడికి భార్య ఆదిలక్ష్మి, కుమారులు గిరి, చరణ్‌లు ఉన్నారు. ఈ కుటుంబానికి గురునాయుడు తెచ్చిన ఆదాయమే దిక్కు. కుటుంబ పోషణ నిమిత్తం వెళ్లిన ఇంటి యజమాని తిరిగి రాడని తెలిసిన బాధిత కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తుని పోలీసులు సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు గుర్ల నుంచి బయల్దేరారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టీవీ చూస్తూ ఇంట్లో ఆకస్మిక మృతి..

కిర్లంపూడి, న్యూస్‌టుడే: ఇంట్లో టీవీ చూస్తూ కుప్పకూలిపడిపోవడంతో కుటుంబసభ్యులు ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని హెడ్‌కానిస్టేబుల్ ఏవీఎస్ మూర్తి తెలిపారు. వివరాలివీ.. జగపతినగరంలోని కొత్తపేటలో నివాసం ఉంటున్న **పలుగు శ్రీనివాస్** (42) తన భార్య లక్ష్మీప్రసన్న నివసిస్తున్నారు. ఇంట్లో టీవీ చూస్తూ శ్రీనివాస్ ముందుకు పడిపోవడంతో భార్య చుట్టుపక్కల వారి సహకారంతో ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే శ్రీనివాస్ మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. శ్రీనివాస్ స్వస్థలం కాకినాడ కాగా జగపతినగరం గ్రామానికి చెందిన లక్ష్మీప్రసన్నను ఆరేళ్ల కిందట కులాంతర వివాహం చేసుకున్నారు. ఇల్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వ బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించే మధ్యవర్తిత్వం చేస్తుంటారు. కొద్ది నెలలు కిందట జగపతినగరంలో అత్తవారింటికి శ్రీనివాస్ మకాం మార్చారు. వీరికి సంతానం లేదు. భార్య లక్ష్మీప్రసన్న ఫిర్యాదుపై హెచ్‌సీ మూర్తి కేసు నమోదు చేయగా, ఎస్సై జి.సతీష్ దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాటుసారాతో ఉన్న వ్యక్తులపై కేసు

గండేపల్లి, న్యూస్‌టుడే: 10 లీటర్ల నాటుసారాతో ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై శివనాగబాబు తెలిపారు. వివరాలివీ.. ఎన్టీ.రాజపురం గ్రామ శివారున అక్రమంగా నాటుసారా తయారుచేస్తున్నారనే సమాచారంతో చేసిన దాడిలో 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 10 లీటర్ల సారాతో ఉన్న వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివనాగబాబు తెలిపారు.

రౌతులపూడి: శృంగవరం గ్రామంలో గురువారం సారా కాస్తుండగా కొల్లు నానాజీ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని ఎస్సై వేంకటేశ్వరరావు తెలిపారు. అతని వద్ద నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

ప్రత్తిపాడు, ఏలేశ్వరం: ఎక్సైజ్ అధికారులు ఏలేశ్వరం మండలం తిరుమాలి శివారు అరటి తోటల్లో సారా బట్టీపై గురువారం దాడి చేశారు. ప్రత్తిపాడు ఎస్‌హెచ్‌వో శివప్రసాద్ నేతృత్వంలో సిబ్బంది సారా తయారీకి నిల్వ ఉంచిన 600 లీటర్ల బెల్లం ఊటను పారబోశారు. అక్కడ ఉన్న సామగ్రిని ధ్వంసం చేశారు. బాధ్యుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో వంశీ రామ్, మల్లికార్జున్, కిరణ్‌పాండే, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతుల భూసమస్యలను తక్షణం పరిష్కరిస్తాం

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వంలో నిర్వహించిన భూముల రీసర్వేలో చోటుచేసుకున్న సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దారు ప్రదీప్ తెలిపారు. నందిఒంపు గ్రామంలో గురువారం రెవెన్యూ అధికారులు గ్రామ సభ నిర్వహించారు. రైతులు తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతులు అందించారు. ఫిర్యాదులను రెండు వారాల వ్యవధిలో పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. వీఆర్వో రాజేష్, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.


గ్రామ సభలో మాట్లాడుతున్న డీటీ ప్రదీప్

ఏలేశ్వరం: వివిధ వర్గాల ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం పలు పథకాలను నిర్వహిస్తోందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. రీ సర్వే అభ్యంతరాలపై పెద్దనాపల్లిలో గురువారం గ్రామసభ జరిగింది. సర్పంచి బుద్ధ సూర్యప్రకాష్, తెదేపా నాయకుడు సుంకర సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

తొండంగి: వేమవరంలో గురువారం జరిగిన రెవెన్యూ గ్రామ సభలకు రైతుల నుంచి 110 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దారు మురార్జి తెలిపారు. ఆర్ఐ రాజారావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

గండేపల్లి: రీసర్వేపై నిర్వహించిన గ్రామసభలో సమస్యలపై 13 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దారు శ్రీనివాస్ అన్నారు. బొర్రంపాలెంలో రీసర్వే గ్రామసభను నిర్వహించారు. వీటిపై 15 రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని తహసీల్దారు అన్నారు. మండల సర్వేయర్ వంశీకృష్ణ, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆగిన బస్సు.. చోదకుడి నృత్యం

తుని పట్టణం, న్యూస్‌టుడే : ఆర్టీసీ బస్సు ముందు ఓ డ్రైవర్ నృత్యం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. తుని డిపోకు చెందిన బస్సు రోడ్డు మార్గంలో నిలిచి ఉన్న సమయంలో డ్రైవర్ కొద్ది సెకన్ల పాటు నృత్యం చేశారు. ఈ వీడియోను కొందరు ఎక్స్‌లో గురువారం పోస్ట్ చేశారు. ఈ వీడియోను ఆసక్తిగా అధిక శాతం మంది వీక్షించారు. దీనిపై ఆర్టీసీ అధికారులను ఆరా తీయగా.. రౌతులపూడి నుంచి తుని వస్తున్న బస్సు మార్గమధ్యలో మరమ్మతుల నిమిత్తం కొద్దిసేపు ఆగిందన్నారు. ఆ సమయంలో బస్సు దిగిన డ్రైవర్ ఓ పాటకు సరదాగా నృత్యం చేసినట్లు తమకు సమాచారం ఉందన్నారు.


బస్సు ముందు నృత్యం చేస్తున్న డ్రైవర్

'జనావాసాల మధ్య మద్యం దుకాణమొద్దు..'

* ఏలేశ్వరంలో మహిళల ధర్నా, ర్యాలీ

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: ఇళ్ల మధ్య మద్యం దుకాణాలు వద్దని కోరుతూ గురువారం ఏలేశ్వరంలో పెద్ద ఎత్తున ఆందోళన జరిగింది. పట్టణంలోని 12 వ వార్డు జామి వారి వీధిలో నూతనంగా మద్యం దుకాణం మంజూరు చేశారని, వెంటనే వేరే ప్రాంతానికి తరలించాలని మహిళలు డిమాండ్ చేశారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి న్యాయం చేయాలని నినదించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన వారు అక్కడే ధర్నా నిర్వహించారు. నిరసనకు నగర పంచాయతీ మాజీ వైస్ ఛైర్మన్ పైల సత్యనారాయణ మద్దతు తెలిపారు. సమస్య పరిష్కారమయ్యే వరకు మీ వెన్నంటే ఉంటామని మహిళలకు ఆయన హామీ ఇచ్చారు. ఇప్పటికే అబ్కారీ శాఖాధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదని వారు ఆరోపించారు. దుకాణాన్ని మరో చోటికి మార్పు చేయకపోతే ఆమరణ నిరాహార దీక్షకు వెనుకాడేది లేదని మహిళలు అన్నారు. తెదేపా నాయకుడు జామి ఆదినారాయణ తదితరులు సంఘీభావం తెలిపి అండగా ఉంటామన్నారు.


ఏలేశ్వరంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు, మహిళలు.

నడవనిద్దాం... 'బాట' చూపుదాం

● ఊరి మధ్య చెరువును బాగుచేస్తే మేలు

న్యూస్‌టుడే-ప్రత్తిపాడు, జగ్గంపేట గ్రామీణం

గ్రామీణ జీవన శైలిలో నడక వ్యాయామానికి ప్రాధాన్యం పెరిగింది. మెట్టలోని అనేక గ్రామాల్లో గడప దాటి వచ్చి రోజులో ఏదో పూట నడక వ్యాయామం చేసే మహిళలు పెరుగుతున్నారు. యువత ఉదయాన్నే పరుగెత్తడానికే మొగ్గు చూపుతున్నారు. వీధుల్లో నడక సాగించాలన్నా మురుగు, గుంతలు, తుప్పలు అడ్డొస్తున్నాయి. ప్రతి ఒక్కరికీ నడక తప్పనిసరి అని విశ్రాంత వైద్యాధికారి ఏవీ రమణ సూచిస్తున్నారు.


ప్రత్తిపాడు మండలంలో పుంతదారుల్లో నడక

ఇదీ పరిస్థితి

ప్రత్తిపాడులో ఊరి మధ్య చెరువు చుట్టూ నడక బాటను ఏర్పాటు చేశారు. ఈ బాట వెంబడి లారీలు, పొక్లెయిన్లు నిలుపుతున్నారు. మిగతా భాగాన్ని బహిర్భూమిగా, మందుబాబులకు అడ్డాగా మారింది. ఉద్యానవనంగా తీర్చిదిద్దే ప్రయత్నం అటకెక్కింది. అనేక మంది కొండ ఎక్కి నడుస్తున్నారు. జగ్గంపేటలోని చెరువు చుట్టూ వ్యాహ్యాళికి చక్కగా నిర్మించిన బాట ధ్వంసమైంది. కత్తిపూడి గ్రామంలో ఊర చెరువు, వడ్డు చెరువులు గ్రామానికి నడిబొడ్డులో ఉన్నా ఆహ్లాదంగా లేవు.

ఇలా చేస్తే ఊరికి ఉపకారం

మెట్టలో కనీసం ఊరికో చెరువు ఉంది. వ్యాయామానికి హైవేల వెంట, పుంత వెంట నడిచే అవసరం లేకుండా తటాకాల చుట్టూ నడక బాటకు అవకాశం ఉంది. ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో 60కిపైగా చెరువులు ఉన్నాయి. పంచాయతీలు ఈ విషయమై దృష్టిపెట్టాలి.

మిద్దెపై నడిస్తే కొత్త సమస్యలు

డాబాపై నడిస్తే కొత్త సమస్యలొస్తున్నాయి. వీధుల్లో పందులు, కుక్కల బెడద ఉంటోంది. చెరువు ఊరి మధ్య ఉంది. నడకబాటను పునరుద్ధరిస్తే ఆహ్లాదంగానూ ఉంటుంది.

- ఎన్.రజని, గృహిణి, ప్రత్తిపాడు

చెరువుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

పల్లెల్లో ఉద్యానానికి అనువుగా ఉన్న ప్రదేశాలను అభివృద్ధి చేసేలా జీపీలకు దిశానిర్దేశం చేస్తాం. చెరువుల అభివృద్ధిపై దృష్టిసారిస్తాం.

- కుమార్‌బాబు, ఎంపీడీవో, ప్రత్తిపాడు

వ్యాసరచన పోటీల్లో పల్లవి ప్రతిభ

తొండంగి: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు అక్టోబరు 2 వరకు జరిగాయి. జిల్లా స్థాయిలో 'స్వచ్ఛ సంకల్పం నా ఆలోచనలు' అనే అంశంపై విద్యాశాఖ వ్యాసరచన పోటీల్లో వాకదారిపేట కస్తూర్బా విద్యాలయం పదో తరగతి విద్యార్థిని డి.పల్లవి ప్రథమ స్థానంలో నిలిచారు. గురువారం కాకినాడలో డీఈవో రమేష్ అవార్డు అందించినట్లు ప్రిన్సిపల్ రాజేశ్వరి తెలిపారు.


కాకినాడలో డీఈవో నుంచి అవార్డు అందుకుంటున్న విద్యార్థిని

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

రౌతులపూడి: జడ్పీ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాజమహేంద్రవరంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో శ్రీరంరెడ్డి కుశరాజు లాంగ్‌జంప్, షాట్‌పుట్‌లో, గొరికపూడి అభినయ్ డిస్కస్ త్రోలో ప్రథమ స్థానాన్ని సాధించారు. ప్రథమస్థానం సాధించడంతో రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు.

క్విజ్ పోటీల్లో రెండో స్థానంలో ఆదర్శ పాఠశాల

శంఖవరం: జిల్లా స్థాయిలో గురువారం కాకినాడలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో శంఖవరం ఆం.ప్ర. ఆదర్శ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభచాటారు. 'స్వచ్ఛతా హీ సేవా' అంశంపై పోటీలు నిర్వహించగా ఆదర్శ పాఠశాలకు రెండో స్థానం లభించింది. విజేతలకు జిల్లా విద్యాశాఖాధికారి పి. రమేష్, జీసీడీవో ఉమామహేశ్వరీ ధ్రువపత్రం, జ్ఞాపికలు అందించారు.

రౌతులపూడి: పోలీసు అమరవీరులను స్మరిస్తూ విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. శ్రీసూర్య డిగ్రీ కళాశాల, జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు 'సైబర్ నేరాలు' అనే అంశమై పోలీసులు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

కేజీబీవీలో కంటి పరీక్షలు

శంఖవరం: శంఖవరంలోని కేజీబీవీ విద్యార్థులకు గురువారం కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు ఉచిత కంటి పరీక్షలు చేశారు. 245 మంది బాలికలకు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్లు అందజేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గండేపల్లి: బాధిత కుటుంబాన్ని జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ పరామర్శించారు. మల్లేపల్లి గ్రామానికి చెందిన నాయుడు సూరిబాబు ఇటీవల మృతిచెందారు. గురువారం ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి సానుభూతి తెలియజేశారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు

తొండంగి: తొండంగి, బెండపూడి గ్రామాల్లో ఉన్న 400 గొర్రెలు మేకలకు నట్టల నివారణ మందు వేసే కార్యక్రమాన్ని గురువారం పశువైద్యాధికారి బి. చైతన్య ప్రారంభించారు. జిల్లా పశువైద్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ అంబేద్కర్ ఈ కార్యక్రమాన్ని పరిశీలించారు.

మధ్యాహ్న భోజన పథక సిబ్బంది సమస్యలపై నిరసన

గండేపల్లి: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథక సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 28న నిరసన చేపడుతున్నట్లు సీఐటీయు మండల కార్యదర్శి లలితా అన్నారు. గురువారం ఎంఈవో నాయక్‌కు ఈనెల 28న చేపట్టబోయే నిరసనపై వినతిపత్రం అందజేశారు.

ట్రైసైకిల్ పంపిణీ

కిర్లంపూడి: జగపతినగరం గ్రామానికి చెందిన ప్రత్యేక అవసరాలు ఉన్న పెనగంటి నాగేశ్వరరావుకు కాకినాడ రోటరీ క్లబ్, కిర్లంపూడి జనసేన నాయకుడు యల్లపు దొరబాబు సంయుక్తంగా సమకూర్చిన ట్రైసైకిల్‌ను తుమ్మలపల్లి రమేష్ గురువారం అందజేశారు.